RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :197 సంపాదకులు: కలిచేటి వెంకయ్య ఆదివారం 14 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad



3 లో నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

## విలేకరులు కావలెను

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.


సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

# నేడు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

15, 16వ తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటన

2026 సీఐఐ పెట్టబడుల సన్నాహక రోడ్ షోలో పాల్గొననున్న సీఎం

సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం వరుస భేటీలు



**అమరావతి, సింధూరదర్శిని:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనా క్లాడియా రాస్ బాచ్‌తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సీఐఐ ఆంధ్ర ప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సీబీఎన్ఏ 361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్-అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి మిగతా 2లో...



## భారత్ అరుదైన ఘనత..

ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

ఐసీబీఎం స్థాయి ముప్పును అడ్డుకునే సామర్థ్యం భారత్ సొంతం

వరుసగా మూడు దీవీణ ఫ్లైట్ టెస్టులు సక్సెస్

ఈ సామర్థ్యం ఉన్న అతికొన్ని దేశాల జాబితాలో భారత్

నేవల్ యాంటీ-షిప్ మిసైల్ తొలి పరీక్ష విజయవంతం

వివరాలు 2 లో

## టీఎంసీలో ముదురుతున్న సంక్షోభం

కేంద్ర మంత్రితో మమత సన్నిహితుడు భేటీ

టీఎంసీలో ముదురుతున్న అంతర్గత సంక్షోభం

కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌తో సుదీప్ బందోపాధ్యాయ భేటీ

ఎన్డీఏకు మద్దతిచ్చేందుకు సిద్ధమైన 20 మంది టీఎంసీ ఎంపీలు

లోక్‌సభ స్పీకర్‌ను కలిసి ప్రత్యేక బ్లాక్‌గా గుర్తించాలని కోరనున్న తిరుగుబాటు వర్గం

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత మొదలైన విభేదాలు



**సింధూరదర్శిని:** పశ్చిమ బెంగాల్‌లో అధికార పీఠాన్ని కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)లో అంతర్గత సంక్షోభం తీవ్రతరమవుతోంది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడు, సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ శనివారం ఢిల్లీలో కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌తో భేటీ కావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ సమావేశంలో తిరుగుబాటు ఎంపీ శతాబ్ది రాయ్ సైతం పాల్గొనడం ప్రాధాన్యత సంతరించుకుంది. మిగతా 2లో...

# తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్‌కల్యాణ్ ఆరా



-ఆధారం అనుకున్న పెంపుడు కుక్క మృతి

-వారం రోజులు గడిచినా ఆచూకీ లభించకపోవడంతో తీవ్రత పెంచాలని ఆదేశం

-గాలింపు చర్యల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాల సేవలు వినియోగించుకోవాలని సూచన

-ఇప్పటికే 400 మంది సిబ్బందితో గాలిస్తున్నట్టు పవన్‌కు వివరించిన ఎస్పీ

-అటవీ నిపుణుల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా జల్లెడ పట్టాలని సలహా

**కాకినాడ జిల్లా, సింధూరదర్శిని:** తుని మండలం సీహెచ్ అగ్రహారంలో వారం రోజుల క్రితం అదృశ్యమైన బాలిక జ్ఞానేశ్వరి ఆచూకీని వీలైనంత వేగంగా కనుగొనాలని డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై ఆయన శనివారం కాకినాడ జిల్లా ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడి, గాలింపు చర్యల పురోగతిని సమీక్షించారు. వారం రోజులు గడుస్తున్నా బాలిక ఆచూకీ లభించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, దర్యాప్తును మరింత ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై ఆయన పలుమార్లు పోలీసు ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుతం పోలీసు, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిర్వహిస్తున్న గాలింపు చర్యలకు అదనంగా మరిన్ని బృందాలను రంగంలోకి దించాలని పవన్ కళ్యాణ్ మిగతా 2లో...

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

కొత్త ఆర్మీ చీఫ్‌గా ధీరజ్ సేథ్ - జూన్ 30న బాధ్యతల స్వీకరణ

ఉపేంద్ర ద్వివేది అదే రోజు రిటైర్ - 1986లో సైన్యంలో చేరిన సేథ్

పలు కీలక కమాండ్లకు నాయకత్వం- సైన్యం ఆధునికీకరణలో కీలక పాత్ర



**న్యూఢిల్లీ:** భారత సైన్యానికి కొత్త ఆర్మీ చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూన్ 30న కొత్తఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అదే రోజు పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ధీరజ్ సేథ్ భారత సైన్యానికి తదుపరి అధిపతిగా బాధ్యతలు చేపట్టనున్నారు. మిగతా 2లో...

# అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

హెల్త్‌కేర్‌లో ప్రెడిక్టివ్ విధానం: మంత్రి సత్యకుమార్ - అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సత్యకుమార్

ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని వ్యాఖ్య

ప్రజల వద్దకే వెళ్లి 45 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని వెల్లడి



**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. తిరుపతి సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సైతం ఇదే విషయాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించారని గుర్తుచేశారు.

గత రెండేళ్ల కాలంలో వైద్య ఆరోగ్య శాఖలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, భవిష్యత్ ప్రణాళికలను మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగి వివరాలను, వారి వైద్య చరిత్రను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓపీ సేవల నుంచి స్పెషలిస్ట్ వైద్య సేవల వరకు అనేక సంస్కరణలు అమలు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సాంప్రదాయ వైద్య విధానాల నుంచి 'ప్రెడిక్టివ్ హెల్త్‌కేర్' విధానంలోకి అడుగుపెట్టామని మంత్రి చెప్పారు. అంటే.. వ్యాధి వచ్చాక వైద్యం చేయడం కంటే, అది రాకముందే గుర్తించేలా వ్యవస్థను మిగతా 2లో...

## ఆ ప్రచారంలో నిజం లేదు..

ఉద్యోగాల షెడ్యూల్‌పై ఏపీపీఎస్సీ క్లారిటీ

ఏపీపీఎస్సీ ఉద్యోగాలపై సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం

వైరల్ అవుతున్న షెడ్యూల్ తాము ఇవ్వలేదని కమిషన్ స్పష్టీకరణ

అసత్య ప్రచారాలు నమ్మవద్దని అభ్యర్థులకు కీలక సూచన

సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్ మాత్రమే చూడాలన్న ఏపీపీఎస్సీ

ప్రభుత్వం ఇచ్చిన జాబ్ క్యాలెండర్‌కు దీనికి సంబంధం లేదన్న అధికారులు

**అమరావతి, సింధూరదర్శిని:** ఏపీలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి సంబంధించి సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్న సమాచారంపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) తీవ్రంగా స్పందించింది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి వైరల్ అవుతున్న షెడ్యూల్ పూర్తిగా అవాస్తవమని, దానిని తాము విడుదల చేయలేదని స్పష్టం చేసింది. నిరుద్యోగ యువత ఇలాంటి తప్పుడు మిగతా 2లో...

## అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి..

**(మొదటిపేజీ తరువాయి)**

మార్చామన్నారు. ప్రజల వద్దకే నేరుగా వెళ్లి 45 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, దీనివల్ల వ్యాధులను ముందే గుర్తించి అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నామని వివరించారు. అలాగే టెలిమెడిసిన్ ద్వారా రోగుల సందేహాలకు నిపుణులైన వైద్యులతో సమాధానాలు ఇప్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన సేవల వల్ల ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం, సంతృప్తి పెరిగాయని.. అందుకే ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందని సత్యకుమార్ అన్నారు. తమ ప్రభుత్వ పనితీరుకు ఆసుపత్రుల్లోని గణాంకాలే నిదర్శనమని చెప్పారు. 'స్వర్ణాంధ్ర-2047' లక్ష్య సాధనలో 'ఆరోగ్యాంధ్రప్రదేశ్' అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని చెబుతూ.. ఈ మార్పునకు సహకరించిన వైద్య సిబ్బందికి, అధికారులకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు సింగపూర్‌కు సీఎం చంద్రబాబు

**(మొదటిపేజీ తరువాయి)**

యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం బృందం సింగపూర్ లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

## భారత సైన్యానికి కొత్త చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్

**(మొదటిపేజీ తరువాయి)**

సేథ్ నేషనల్ డిఫెన్స్ అకాడమీలో శిక్షణ పొందారు. 1986 డిసెంబర్‌లో ఆర్మర్డ్ కార్ప్స్‌లో అధికారిగా సైన్యంలో చేరారు. దాదాపు 40 ఏళ్లకు పైగా సాగిన సైనిక జీవితంలో కీలక బాధ్యతలు నిర్వహించారు.

ఎడారి ప్రాంతాల్లో ఆర్మర్డ్ రెజిమెంట్‌కు నాయకత్వం వహించిన ధీరజ్ సేథ్, పశ్చిమ సరిహద్దు ప్రాంతంలో ఆర్మ్‌డ్ బ్రిగేడ్‌కు కమాండర్‌గా పనిచేశారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను పర్యవేక్షించే దళాలకు కూడా నాయకత్వం అందించారు. లెఫ్టినెంట్ జనరల్ హోదాలో భారత సైన్యంలో అత్యంత కీలకమైన స్ట్రైక్ ఫార్మేషన్లలో ఒకటైన సుదర్శన్ చక్ర కార్ప్స్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. ఢిల్లీ ప్రాంత జనరల్ ఆఫీసర్ ఇన్ కమాండింగ్‌గా కూడా పనిచేశారు. ఈ సమయంలో దేశీయ, అంతర్జాతీయ సైనిక కార్యక్రమాల సమన్వయం బాధ్యతలు నిర్వర్తించారు. సైన్యాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ధీరజ్ సేథ్ కీలక పాత్ర పోషించారు. సైనిక సామర్థ్యాల పెంపు, భవిష్యత్ వ్యూహాల రూపకల్పన, దళాల పునర్వ్యవస్థీకరణ వంటి అంశాల్లో ఆయన సేవలు విశేష గుర్తింపు పొందాయి. ధీరజ్ సేథ్ హయ్యర్ కమాండ్ కోర్స్, నేషనల్ డిఫెన్స్ కాలేజ్‌లో ఉన్నత శిక్షణ పొందారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో నిర్వహించే ప్రతిష్ఠాత్మక కమాండ్ అండ్ స్టాఫ్ కోర్స్‌లో కూడా పాల్గొన్నారు. సమకాలీన సైనిక వ్యూహాలపై ఆయనకు విస్తృత అవగాహన ఉందని అధికారులు చెబుతున్నారు.

## టీఎంసీలో ముదురుతున్న సంక్షోభం

**(మొదటిపేజీ తరువాయి)**

పార్టీకి చెందిన సుమారు 20 మంది లోక్‌సభ సభ్యులు తమను ప్రత్యేక బృందంగా గుర్తించాలని కోరుతున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. ఇటీవల వెలువడిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీఎంసీ ఓటమి పాలవగా, బీజేపీ నేత సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో మొదలైన విభేదాలు ఇప్పుడు పార్లమెంటు స్థాయికి చేరాయి. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం నుంచి తప్పించుకునేందుకు, బీజేపీలో విలీనం కాకుండానే ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని తిరుగుబాటు వర్గం భావిస్తోంది. కాకోలీ ఘోష్ దస్తీదార్ వంటి నేతల నేతృత్వంలో తామే అసలైన టీఎంసీ అని ఈ వర్గం వాదిస్తోంది. తిరుగుబాటు ఎంపీ జగదీష్ బసునియా వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ బృందం ఆదివారం ఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని, సోమవారం (జూన్ 15న) లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలవనుంది. సభలో తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని వారు స్పీకర్‌ను కోరనున్నారు. తొలుత ప్రచారంలో ఉన్న 19 మంది తిరుగుబాటు ఎంపీల జాబితాలో సుదీప్ బందోపాధ్యాయ పేరు లేదు. అయితే, కేంద్ర మంత్రితో ఆయన నేరుగా సమావేశం కావడంతో పార్టీలో చీలిక లోతుగా ఉందనే విషయం స్పష్టమవుతోంది. అయితే, సుదీప్ తీరుపై టీఎంసీ ఎమ్మెల్యే కునాల్ ఘోష్ తీవ్ర విమర్శలు గుప్పించారు. మరోవైపు, పార్టీ విధేయ వర్గంలోని కొందరు నేతలు ఐక్యత కోసం ప్రయత్నిస్తున్నారు. గతంలో అభిషేక్ బెనర్జీపై విమర్శలు గుప్పించిన కల్యాణ్ బెనర్జీ, తాజాగా ఆయనను "నా కొడుకు వంటివాడు" అంటూ స్వరం మార్చారు.

## ఆ ప్రచారంలో నిజం లేదు..

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రచారాలను నమ్మవద్దని కమిషన్ ప్రకటించింది. గత రెండు రోజులుగా ఏపీపీఎస్సీ పేరుతో కొన్ని నోటిఫికేషన్ల షెడ్యూల్స్, డాక్యుమెంట్లు సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని కమిషన్ తెలిపింది. నియామక షెడ్యూళ్లు, పరీక్షలు, ఫలితాలు, ఎంపికలకు సంబంధించి ధ్రువీకరణ లేని, తప్పుదోవ పట్టించే సమాచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు సూచించింది. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని ఇతరులకు షేర్ లేదా ఫార్వార్డ్ చేయవద్దని కోరింది. ఏదైనా సమాచారం కోసం కేవలం కమిషన్ అధికారిక వెబ్‌సైట్ అయిన జూం.ఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ ను మాత్రమే సంప్రదించాలని స్పష్టం చేసింది. వాస్తవానికి ఈ ఏడాది ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ఈ క్యాలెండర్‌ను ప్రకటించారు. ఏయే తేదీల్లో నోటిఫికేషన్లు వస్తాయి, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారు వంటి వివరాలను అందులో పొందుపరిచారు. ఈ పోస్టులన్నింటినీ నిర్దేశిత సమయంలోనే భర్తీ చేస్తామని మంత్రి లోకేశ్ కూడా గతంలో హామీ ఇచ్చారు. అయితే, ఈ అధికారిక క్యాలెండర్‌కు సంబంధం లేకుండా కొందరు ఆకతాయిలు నకిలీ షెడ్యూల్స్ సృష్టించి గందరగోళం సృష్టిస్తున్నారని ఏపీపీఎస్సీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలని ఏపీపీఎస్సీ నొక్కి చెబుతోంది. సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, అధికారిక ప్రకటనల కోసం వేచి చూడటం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు. నియామక ప్రక్రియకు సంబంధించిన ప్రతి అప్‌డేట్‌ను ఏపీపీఎస్సీ తన వెబ్‌సైట్ ద్వారానే అధికారికంగా వెల్లడిస్తుంది.

# భారత్ అరుదైన ఘనత.. ఖండాంతర క్షిపణులనూ అడ్డుకునే సామర్థ్యం!

సింధూరదర్శిని: రక్షణ రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే అడ్డుకుని ధ్వంసం చేసే సామర్థ్యాన్ని డీఆర్‌డీఓ విజయవంతంగా పరీక్షించింది. సముద్రంలో శత్రు నౌకలను లక్ష్యంగా చేసుకొనే కొత్త క్షిపణి సామర్థ్యాన్నీ ప్రదర్శించింది. వరుసగా నిర్వహించిన మూడు ప్రయోగాత్మక పరీక్షలు విజయవంతం కావడంతో అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థలు కలిగిన దేశాల సరసన భారత్ నిలిచింది. డీఆర్‌డీఓ నిర్వహించిన మూడు వరుస పరీక్షల్లో ఇంటర్‌సెప్టర్ క్షిపణులు తమ లక్ష్యాలను కచ్చితంగా ఛేదించాయి. బహుళస్థాయి బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ సామర్థ్యాన్ని ఈ పరీక్షలు నిరూపించాయి.




ఆధునిక క్షిపణి ముప్పులను ఎదుర్కొనేలా రూపొందించిన ఈ వ్యవస్థ శత్రు బాలిస్టిక్ క్షిపణులను లక్ష్యానికి చేరకముందే నిర్వీర్యం చేయగలదని అధికారులు తెలిపారు. ఈ విజయాలతో భారత్ ప్రపంచంలోని కొన్ని దేశాలకే ఉన్న ప్రత్యేక సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) సహా అత్యంత ప్రమాదకరమైన క్షిపణి ముప్పును అడ్డుకునే రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేసిన దేశాల జాబితాలో భారత్ చేరిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇది దేశ భద్రతా వ్యవస్థకు కీలక బలాన్ని చేకూర్చనుంది. మరోవైపు నేవల్ యాంటీ-షిప్ మిసైల్ (మీడియం రేంజ్) తొలి ఫ్లైట్ టెస్ట్‌ను కూడా డీఆర్‌డీఓ విజయవంతంగా పూర్తి చేసింది. మధ్యశ్రేణి దూరంలో శత్రు యుద్ధ నౌకలను కచ్చితంగా లక్ష్యంగా చేసుకునే ఈ క్షిపణి భారత నౌకాదళ దాడి సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. ఈ విజయాలపై డీఆర్‌డీఓ శాస్త్రవేత్తలను రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు.

# తుని బాలిక అదృశ్యం ఘటనపై పవన్ కల్యాణ్ ఆరా

**(మొదటిపేజీ తరువాయి)**

సూచించారు. ముఖ్యంగా, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) సేవలను కూడా వినియోగించుకోవాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాలిక ఇంటి పరిసరాల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉన్నందున, ఆ ప్రాంతంలో విస్తృతంగా జల్లెడ పట్టాలని తెలిపారు. అడవుల్లో తిరగడంలో నైపుణ్యం ఉన్న నిపుణులు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ నైట్ వాచర్లు, బేస్ క్యాంప్ వాచర్ల సహాయం తీసుకోవడం ద్వారా గాలింపును మరింత ప్రభావవంతంగా మార్చాలని సలహా ఇచ్చారు. ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ చేపడుతున్న చర్యలను డిప్యూటీ సీఎంకు వివరించారు. బాలిక ఆచూకీ కోసం ఇప్పటికే 400 మందికి పైగా సిబ్బంది గాలింపు చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అత్యాధునిక డ్రోన్ల సహాయంతో అణువణువూ గాలిస్తున్నామని, బాలిక ఇంటి చుట్టుపక్కల ఉన్న 38 సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించామని ఆయన పవన్ కల్యాణ్‌కు తెలియజేశారు. డిప్యూటీ సీఎం ఆదేశాల నేపథ్యంలో గాలింపు చర్యలను మరింత విస్తృతం చేసి, అదనపు బలగాలను సమీకరించి, బాలికను సురక్షితంగా గుర్తించేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఉన్నత స్థాయి నుంచి వస్తున్న పర్యవేక్షణతో ఈ కేసు దర్యాప్తులో మరింత వేగం పుంజుకుంది.

**తుని చిన్నారి అదృశ్యం కేసులో ఆధారం అనుకున్న శునకం మృతి**

చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. బాలిక ఆచూకీ కనుగొనడంలో పోలీసులకు కీలక ఆధారంగా నిలుస్తుందని భావించిన కుటుంబం పెంపుడు కుక్క మరణించింది. దీంతో ఈ కేసు దర్యాప్తులో పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది. తుని మండలం దొండవాక పంచాయతీ పరిధిలోని సీహెచ్ అగ్రహారంలో నివసిస్తున్న సుంకర గణేష్, భవానీ దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి జూన్ 6వ తేదీన ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమైన విషయం తెలిసిందే. పాపతో పాటు వారి పెంపుడు కుక్క కూడా కనిపించకుండా పోయింది. అయితే, కొన్ని రోజుల తర్వాత ఆ శునకం మాత్రమే తిరిగి ఇంటికి వచ్చింది. దీంతో బాలిక జాడ కోసం పోలీసులు ఆ కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చి దాన్ని వదిలిపెట్టారు. జీపీఎస్ అమర్చిన తర్వాత ఆ శునకం సుమారు 80 నిమిషాల పాటు 8 కిలోమీటర్ల మేర సమీప పొలాలు, అటవీ ప్రాంతంలో తిరిగి, మళ్లీ ఇంటికి చేరుకుంది. కానీ, ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే కుప్పకూలి ప్రాణాలు విడిచింది. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడం వల్లే అలసటతో అది మరణించి ఉంటుందని భావిస్తున్నారు.

ఇప్పటికే పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్, అటవీ శాఖ బృందాలు డ్రోన్ల సహాయంతో విస్తృతంగా గాలిస్తున్నప్పటికీ బాలిక ఆచూకీ లభించలేదు. ఇప్పుడు కీలక ఆధారం అనుకున్న శునకం కూడా మరణించడంతో ఈ కేసు మరింత మిస్టరీగా మారింది. పోలీసులు కిడ్నాప్ సహా ఇతర కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు.

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు.. వేలాది ఉద్యోగాలు: మంత్రి టీజీ భరత్

**పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్న భరత్**

**కర్నూలులో నిర్వహించిన జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొన్నాయని వెల్లడి**

**రిలయన్స్, అగస్త్య సంస్థలను కర్నూలుకు తీసుకువచ్చామన్న మంత్రి**

అమరావతి, సింధూరదర్శిని: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, వీటి ద్వారా వేలాది మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈరోజు కర్నూల్‌లో పర్యటించిన మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొని మీడియాతో మాట్లాడారు. కర్నూల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో 19 కంపెనీలు పాల్గొన్నాయని, మొత్తం 1,460 ఉద్యోగ అవకాశాలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఒక వ్యక్తికి ఉద్యోగం లభిస్తే ఆ కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి




జాబ్‌మేళాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఓర్వకల్లుకు ఎన్నడూ లేనంతగా పరిశ్రమలు వస్తున్నాయని, రిలయన్స్, అగస్త్య సంస్థలను కర్నూలుకు తీసుకువచ్చామని వెల్లడించారు. జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ మరో రూ.6 వేల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు అమలైతే ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి అభివృద్ధి సాధిస్తుందని మంత్రి భరత్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

**మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందజేసిన ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు**

ప్రొద్దుటూరు, సింధూరదర్శిని: ప్రొద్దుటూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథిని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. శనివారం ప్రొద్దుటూరు పర్యటనకు విచ్చేసిన మంత్రికి ఆర్‌డబి అతిథి గృహంలో.. జర్నలిస్టులు వారి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. జర్నలిస్టులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి,



జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# రెండేళ్ల నమ్మకం విజయోత్సవ సభ ఏర్పాట్లు పరిశీలన

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి

నెల్లూరు (సింధూర దర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా; రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా 'రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' పేరుతో పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయిలో నెల్లూరు నగరంలోని కెవిఆర్ పెట్రోల్ సమీపంలో గల కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఈనెల 16వ తేదీ కూటమి నేతలు బహిరంగ సభను నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో శనివారం కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నెల్లూరు పార్లమెంటరీ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, రాష్ట్ర అంతర్గత జలమార్గాల అథారిటీ చైర్మెన్ జెడ్ శివప్రసాద్, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్ రెడ్డి తో కలసి పరిశీలించారు..సభకు హాజరయ్యే ప్రజలకు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల వసతులు కల్పించాలని, ఏర్పాట్లు పక్కాగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా వారు అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.వారి వెంట అధికారులు జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు,డిఈఓ బాలాజీ రావు ఇతరల అధికారులు పాల్గొన్నారు.

# జే.వి.వి.లో సభ్యులుగా చేరండి

## గోడ పత్రికలు ఆవిష్కరణ



గూడూరు( సింధూర దర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా; జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సి.వి.సి పార్క్ నందు జే.వి.విలో సభ్యులుగా చేరండి అను గోడ పత్రికలను జె వి వి ప్రతినిధులు ఆవిష్కరించారు. జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక గత 38 సంవత్సరాలనుండి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం, మూఢ నమ్మకాల నిర్మూలన కోసం పనిచేస్తుందని ప్లాస్టిక్‌ను నిషేధించాలని మరియు విద్యార్థులకు సైన్స్ పట్ల అవగాహన కల్పించడానికి చెకుముకి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యార్థులు జే.వి.విలో భాగస్వాములు కావాలని మంచి సమాజం కోసం అందరం కష్టపడదామని కోరారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, సుబ్బారావు, ప్రభాకర్, ఆనంద్, శ్రీనివాసాచారి, సురేష్, పసల వెంకటేశ్వర్లు, మనోభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు ( సింధూర దర్శిని ) 13 జూన్ నెల్లూరు జిల్లా ; స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల రెండో శనివారం క్రమం తప్పకుండా నిర్వహించే ఈ సేవా కార్యక్రమంలో భాగంగా.. శ్రీ శ్రీశ్రీ వెంకయ్యస్వామి పీఠం (గాలిపాలెం) ప్రముఖ దాతలు మెడనూరు సురేష్ రెడ్డి, వారి సతీమణి శాంతి ఆర్థిక సహాయంతో ఆశ్రమ నివాసితులకు రుచికరమైన మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడవేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంస్థ చేపట్టిన మూడు ముఖ్యమైన లైఫ్ టైమ్ ప్రాజెక్టులలో ఈ అన్నదాన కార్యక్రమం ఒకటని తెలిపారు. సురేష్‌రెడ్డి దంపతుల నిరంతర సహకారం వల్లే ప్రతి నెల వృద్ధులకు నాణ్యమైన భోజనాన్ని అందించగలుగుతున్నామని, వారి సేవా నిరతి అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు కాటూరి శ్రీనివాసులు వాచి షాప్ రాము కుమార్ నాయుడు కృష్ణారెడ్డి వెంకట్రావు సోనాలి షాప్ అధినేత మల్లీ విజయ్ నిర్వాహరాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల టెట్, ఉద్యోగుల విభజన అవగాహన సదస్సు

పంగులూరు, ( సింధూర దర్శిని) ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు అద్దంకి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అద్దంకి డివిజన్ స్థాయిలో టెట్ మరియు ఉద్యోగుల విభజనపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని యు టి ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్వీ దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు హాజరవుతున్నారన్నారు. అద్దంకి, కొరిశపాడు, జేపంగులూరు, బల్లికురవ, సంతమాగులూరు మండలాల యుటిఎఫ్ కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు.





# నిరుద్యోగ యువతకు సువర్ణావకాశం

**జూన్ 17న నార్త్ రాజుపాలెంలో మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు**

**జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ చే పోస్టర్ ఆవిష్కరణ**

నెల్లూరు (సింధూర దర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా ; నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల జూన్ 17వ తేదీన కోవూరు నియోజకవర్గంలో నిర్వహించ బోయే భారీ మెగా జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలని కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యుం, ఏపీఎస్ఎస్డిసీ జిల్లా అధికారి శ్రీధర్ లు మెగా జాబ్ మేళా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చే పోస్టర్ ఆవిష్కరణ చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కాలేజీలో ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు..ఈ మెగా జాబ్ మేళాలో సుమారు 15 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, వీటి ద్వారా దాదాపు 2100 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే వివరించారు. 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, డిప్లొమా, బీ.టెక్, బీ.ఫార్మసీ, పీజీ చదివిన అభ్యర్థులందరికీ వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. 18 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థుల విద్యార్హతలు, అనుభవాన్ని బట్టి నెలకు కనీసం రూ.12,000 నుంచి గరిష్ఠంగా రూ.25,000 వరకు జీతం ఉంటుందని, కొన్ని కంపెనీలలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారని తెలిపారు. నియామకమైన వారు కంపెనీల అవసరాలను బట్టి నెల్లూరు, నాయుడుపేట, ముత్తుకూరు సెజ్, శ్రీసిటీ సెజ్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో పని చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.కోవూరు నియోజకవర్గంలో స్థానిక యువతకు ఉద్యోగాలు అందించేందుకు నిరంతరం కృషి జరుగుతోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో స్థానిక అవసరాల కోసం మండల స్థాయిలో 7 మినీ జాబ్ మేళాలు నిర్వహించగా, 698 మంది హాజరయ్యారని, అందులో 277 మంది ఎంపికయ్యారని తెలిపారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) లో ఇప్పటివరకు నియోజకవర్గం, జిల్లా స్థాయిలో 3 మెగా జాబ్ మేళాలు నిర్వహించామని, వీటికి 798 మంది అభ్యర్థులు హాజరుకాగా 378 మంది ప్రతిష్టాత్మక కంపెనీలకు ఎంపికయ్యారని ఎమ్మెల్యే వెల్లడించారు. యువత నైపుణ్యాలను ఉద్యోగాలుగా మార్చేందుకు ఈ జాబ్ మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని, జూన్ 17న జరిగే ఈ మెగా జాబ్ మేళాకు అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో హాజరై సద్వినియోగం చేసుకోవాలని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోరారు.





# ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఆర్థిక సాయం

**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**

నెల్లూరు (సింధూర దర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా; పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతో ప్రతిభావంతులైన విద్యార్థినులకు కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అండగా నిలిచారు. నెల్లూరులోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం విపిఆర్ విద్య పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు విపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఉన్నత చదువుల నిమిత్తం ఆర్థిక సాయం (చెక్కులను) అందజేశారు.విపిఆర్ విద్య పాఠశాలలో పదో తరగతిలో 594 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన చింతాడ మానస అనే విద్యార్థిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుకునేందుకు కళాశాల ఫీజుల నిమిత్తం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెక్కును అందజేసి అభినందించారు. అదేవిధంగా, గత సంవత్సరం ఇదే పాఠశాలలో ప్రతిభ కనబరిచిన పొట్టికోటి గాయత్రి అనే మరో విద్యార్థిని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువును కొనసాగించేందుకు గాను ఆమెకు కూడా ఏడాది కళాశాల ఫీజులనిమిత్తం చెక్కును అందజేశారు.?ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదన్నదే తమ ఆశయమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక సాయం అందుకున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యే కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లతో ఆర్డీవో సమీక్ష



గూడూరు ( సింధూర దర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా ; ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయడం కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి, మునిసిపల్ కమీషనర్ మరియు అర్బన్ తహసీల్దారు వివిధ రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లతో ఈ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు చర్చించారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియను ఎటువంటి తప్పులు లేకుండా, పారదర్శకంగా మరియు పకడ్బందీగా పూర్తి చేసేందుకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు అధికారులకు సహకరించాలని ఈ సమావేశంలో కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి తదితర నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# గిరిజనుల కుటుంబాలకు అన్నదానం



గూడూరు (సింధూరదర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా; గూడూరు కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం గూడూరు నెల్లటూరు చెరువు కట్ట మింద నివాసం ఉంటున్న 70 నిరుపేదలకు వృద్ధులకు చిన్న పిల్లలకు అన్నదానం సమాజ సేవ లక్ష్యంగా చిల్లకూరులో ఉన్న మా ట్రస్ట్ కుటుంబ సభ్యులు అమృత విలాస్, అధినేత, సుద్ద రాసి పెంచలయ్య, మాధవి, దంపతులు సహకారంతో, ప్రతి నెల రెండో శనివారం, అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగినదని. ఈ సందర్భంగా అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నదానం కార్యక్రమం కొనసాగడానికి చిల్లకూరు అమృత విలాస్ అధినేత సుద్ద రాసి పెంచలయ్య మాధవి కుటుంబ సభ్యులు సహకారముతో ప్రతి నెల రెండో శనివారం నిరుపేదలకు సహాయం చేయటం చాలా సంతోషం అలాగే మా కృపా సేవా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులందరూ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కటకం శ్రీనివాసులు ఉపాధ్యక్షుడు అత్తి మంజరి గోపాల్ దార్ల, హేమ కుమార్ కోడి శివ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన పై పిల్లలకు అవగాహన



శ్రీకాళహస్తి ( సింధూర దర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా ; శ్రీకాళహస్తి రూరల్ మండలం ఎర్రమరెడ్డిపల్లి గ్రామంలో బాలల సంఘం పిల్లలకు ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా బాలల సంఘం పిల్లలను ఉద్దేశించి క్రమం తప్పక పాఠశాలకు రావాలని కనీసం 18 సంవత్సరాలు నిండే వరకు పాఠశాల కళాశాల విద్య పూర్తి చేయాలని భవిష్యత్తులో అభివృద్ధి సాధించాలంటే విద్య తప్పనిసరి అని తెలిపారు.

బాల కార్మికులు ఏర్పడకపోతే సమాజం అభివృద్ధి వైపు నడుస్తుందని తెలిపారు పిల్లలచే బాల కార్మిక వ్యవస్థలో ఏర్పడే కష్టనష్టాలు చదువుకుంటే భవిష్యత్తు అభివృద్ధి దశలో పయనిస్తారని లేకుంటే అన్ని సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు బాలల సంఘం పిల్లలు బాల కార్మిక వ్యవస్థపై అనేక సందేహాలు సమస్యలు తెలుసుకుని నష్టాలు వస్తాయని చదువుకుంటే బంగారు భవిష్యత్తు మాదేనని వారు తెలిపారు. చిన్నతనంలోనే విద్యకు దూరమైతే భవిష్యత్తు అంధకారమని వారు చార్టర్ రూపంలో బాల కార్మిక వ్యవస్థపై బాల హక్కులపై వివరించారు ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ కో కన్వీనర్ రామచంద్ర బాలల సంఘం పిల్లలు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై మర్రిపాడు పోలీసులు ఆకస్మిక దాడి




మర్రిపాడు (సింధూరదర్శిని) 13 జూన్ నెల్లూరు జిల్లా; జిల్లాలో పేకాట, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు జిల్లా ఇంచార్జి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్. పి అడ్మిన్ సౌజన్య సూచనల మేరకు,మర్రిపాడు పోలీసులు శనివారం కేతిగుంట శివారు ప్రాంతంలో ఆకస్మిక దాడి నిర్వహించారు. పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం ఆధారంగా నిర్వహించిన ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ. 22,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, పేకాట, మట్కా, గ్యాంబ్లింగ్, కోడిపందేలు వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉన్న ప్రజలు వెంటనే డయల్-112 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ +919392903413 ద్వారా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ దాడిలో మర్రిపాడు ఎస్సై మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 80 సర్వే నెంబర్లలోని పబ్లిక్ పర్పస్ స్థలాలు, రోడ్ల ఆక్రమణలను తొలగించాలి



బద్వేల్, సింధూరదర్శిని: బద్వేల్ పట్టణ కేంద్రంలోని సుమారు 80 పైగా సర్వే నెంబర్లలోని పబ్లిక్ పర్పస్ స్థలాలు, రోడ్లు, కల్వర్టులు మాయమయ్యాయని, వాటిని కొంతమంది పెద్ద మనుషులు ముసుగులో ఆక్రమించి లక్షలాది రూపాయ లకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని, వాటన్నింటి పైన జిల్లా ఉన్నతస్థాయి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆక్రమణలను తొలగించి బద్వేల్ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని ఉమ్మడి కడప జిల్లాడీసీసీబి బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డి గారికి శనివారం ఉదయం సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ బృందం ఆయన ఆఫీసు నందు కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. దీనికి స్పందించిన మంచూరి సూర్యనారాయణ రెడ్డి ఆక్రమణదారులు ఎవరైనా ఏ పార్టీకి చెందిన వారైనా క్షమించేది లేదని తప్పకుండా వీటన్నింటిపై జిల్లాస్థాయి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణ తొలగించేం దుకు ప్రయత్నం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీసభ్యులు ఎస్ చంద్రశేఖర్ మాట్లాడుతూ, గత రెండు మూడు సంవత్సరాలుగా కొంతమంది అధికార పార్టీ ప్రతినిధుల ముసుగులో ఉన్న నాయకులు ఒక కోటరీగా ఏర్పడి మడకలవారిపల్లె గ్రామ పొలంలోని 811, 808, 1013, 953, 163,164,812 లతోపాటు మరి కొన్ని సర్వే నెంబర్లలోని ప్రభుత్వ పబ్లిక్ పర్పస్ స్థలాలను మరియు పెద్ద రోడ్లను చిన్న రోడ్లుగా కుదించి కొన్ని రోడ్లు పూర్తిగా ఆక్రమించి పెద్దపెద్ద భవనాలు నిర్మించి లక్షలాది రూపాయలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అలాగే గోపవరం రెవిన్యూ పొలం 168, 1635 1636,1624 మరియు సెంచరీ ఫ్యాక్టరీ పక్కనే ఉన్న 1557 సర్వే నెంబర్లలో పెద్ద ఎత్తున ఆక్రమాలు జరిగాయని అలాగే బద్వేల్ మండలం సి కొత్తపల్లె పొలం 53,54 లతోపాటు యువనేత ముఖ్య అనుచరుడు మరి కొంతమంది కలిసి సిద్ధవటం రోడ్డులోని విద్యుత్ సబ్స్టేషన్ సమీపంలోని చెన్నంపల్లి గ్రామ పొలం 1580ఋ నందు రెవెన్యూ అధికారుల సహకారంతో ఎకరా స్థలం పైబడి ఆక్రమించి కంచె వేశారని అలాగే 1616 సర్వే నెంబర్ లోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఎవరైనా ప్రజాస్వామ్యవాదులు వామపక్ష పార్టీల నాయకులు ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఫిర్యాదుదారులపైనే కేసులు నమోదు చేసే ఆనవాయితీని బద్వేల్ రెవిన్యూ అధికారులు పాటిస్తూ కబ్జాదారులకు సహకరిస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. గోపవరం రెవిన్యూ పొలంలోని 1848,1852లోని విలువైన ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వ సెలవు దినాలను అవకాశంగా తీసుకొని పట్టపగలే చదును చేస్తున్నారని వీటితోపాటు నాగుల చెరువు, భాకరాపేట, బయనపల్లె, చింతలచెరువు,ఈ విషయాలన్నిటి పైన ఇప్పటికే తహసీల్దార్ నుండి జాయింట్ కలెక్టర్ వరకు ఆధారాలతో కూడిన వినతి పత్రాలను ఇవ్వడం జరిగిందని మీరు కూడా జిల్లాస్థాయి అధికారులతో చర్చించి త్వరితగతిన ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకునే విధంగా కృషి చేసి బద్వేల్ పట్టణ ప్రజలను కాపాడాలని ఉమ్మడి కడప జిల్లా డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణ రెడ్డికి విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య నియోజకవర్గ కమిటీ సభ్యులు విజయరావు, కే బాబు, నారాయణ, జయరామరాజు, రామరాజు, గంటా మహబూబ్బాషా పట్టణ కమిటీ సభ్యులు చెన్నయ్య, సలీం, నరసింహ పాల్గొన్నారు.




# హౌసింగ్ అక్రమాలపై ఉక్కుపాదం

**హౌసింగ్ శాఖ సమీక్ష సమావేశంలో అధికారులకు మంత్రి పార్థసారథి సీరియస్ వార్నింగ్.**

**సెప్టెంబర్ నాటికి పెండింగ్ ఇళ్లు పూర్తి చేయాలి**

**స్వాహా చేసిన నిధుల రికవరీకి చర్యలు**

కడప సింధూరదర్శిని: గతంలో హౌసింగ్ శాఖలో జరిగిన అవకతవకలు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది పేద లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మండిపడ్డారు. శనివారం మధ్యాహ్నం ప్రొద్దుటూరు ఆర్‌డబి అతిథి గృహంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి.. స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డితో కలిసి జిల్లా హౌసింగ్, రెవెన్యూ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ లేఅవుట్లలో గృహ నిర్మాణాల పురోగతి, పెండింగ్ పనులు, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించిన మంత్రి, గతంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే సహించబోమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు, సిబ్బంది చేసిన నిర్వాకం వల్ల పేదలు నష్టపోయారని.. పేదల కోసం కేటాయించిన నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వస్తున్నాయి. జరిగిన ప్రతి అక్రమంపై విచారణ జరిపి స్వాహా చేసిన కోట్ల రూపాయలను తిరిగి రికవరీ చేయాలని మంత్రి ఆదేశించారు. మెప్మా మహిళా సంఘాలు, హౌసింగ్ నిర్మాణాలకు సంబంధించిన నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ, ప్రజాధనం దుర్వినియోగం చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమన్నారు. బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని బొల్లవరం, రామేశ్వరం, మీనాపురం హౌసింగ్ లేఅవుట్లలో ఇంకా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రానున్న సెప్టెంబర్-అక్టోబర్ నాటికి పెండింగ్ గృహాలన్నీ పూర్తి చేసి లబ్ధిదారులు కాలనీల్లో నివాసం ఉండేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, "ప్రభుత్వం జీతాలు ఇస్తోంది ప్రజలకు సేవ చేయడానికి.. ఫైళ్లను పెండింగ్‌లో పెట్టడానికి కాదు. ఇకపై నిర్లక్ష్యం, అలసత్వం అస్సలు సహించం. లక్ష్యాలు చేరుకోలేకపోతే ఉద్యోగాలు వదిలి ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితులు తెచ్చుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న మంత్రి, రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని తెలిపారు. ప్రతి అర్హ లబ్ధిదారుడు తన ఇంటిలో నివసించే వరకు ప్రభుత్వం వెనక్కి తగ్గదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ, ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని హౌసింగ్ లబ్ధిదారుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుందని, పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించి పేదలకు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జమ్మలమడుగు ఆర్డీఓ శిరీష, హౌసింగ్ సీఈ వేణుగోపాల్, జిల్లా హౌసింగ్ పీడి రాజారత్నం, తహశీల్దార్ ఉదయ భాస్కర్, హౌసింగ్ డీఈలు సంబందిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యనమదుర్రు కాలువలో 32 కి.మీ. మేర కిక్కిస తొలగింపు పనుల ప్రారంభం



భీమవరం సింధూరదర్శిని:యనమదుర్రు కాలువలో 32 కిలోమీటర్ల మేర కిక్కిస తొలగింపు పనులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శనివారం ప్రారంభించారు. భీమవరం లాంచీల రేవు వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రెయిన్‌లలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, నాచు, కిక్కిస వంటి కలుపు మొక్కలను సకాలంలో తొలగించడం వల్ల నీటి పారుదల సాఫీగా సాగుతుందని తెలిపారు. సుమారు రూ. 1.50 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనుల ద్వారా యనమదుర్రు డ్రెయిన్‌లో నీటి ప్రవాహం మెరుగుపడి రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గనున్నాయని పేర్కొన్నారు. డ్రెయిన్ ఇరువైపులా దట్టంగా పెరిగిన కిక్కిసను పూర్తిగా తొలగించి కాలువ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, సంబంధిత శాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.



## మానవత కోడూరు శాఖ నూతన చైర్మన్‌గా కె.ప్రసాద్‌వర్మ ప్రమాణస్వీకారం

రైల్వేకోడూరు, సింధూరదర్శిని:
తిరుపతి జిల్లా రైల్వే కోడూరు మండల పరిధిలోని మామిడికాయల మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణమండపంలో శనివారం మానవతా గోడూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడినది. ఈ ప్రమాణ స్వీకారంలో చైర్మన్ గా కె. ప్రసాద్ వర్మ ప్రమాణస్వీకారం చేయగా ఆయనతోపాటు నూతన కార్యవర్గం కూడా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి కేంద్ర మానవతా శాఖ కన్వీనర్ ఏ. రామాంజనేయులు రెడ్డి, మాజీ కడప జిల్లా మానవతా అధ్యక్షులు సి. సుబ్బారెడ్డి,రీజినల్ కమిటీ కన్వీనర్ జీ. రెడ్డన్న ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.
కోడూరు మానవతా శాఖ చైర్మన్ కె. ప్రసాద్ వర్మ ఆధ్వర్యంలో, పూర్వ అధ్యక్షులు ఎం. చంద్రమోహన్ రాజు నిర్వహణలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

2026--2027 నూతన కార్యవర్గం
కె. ప్రసాద్ వర్మ – చైర్మన్
టి. వెంకటరమణ యాదవ్ – కో–చైర్మన్
ఏ. శ్రీనివాసులు – కన్వీనర్
ఆర్. చంగల్ రెడ్డి – అధ్యక్షులు
ఏ. శుభాష్ బాబు – ఉపాధ్యక్షులు
బి. నాగరాజు – కార్యదర్శి
బి. జోసెఫ్ – జాయింట్ కార్యదర్శి
ఎస్. మస్తాన్ సాహెబ్ – ఈసీ (విద్య)
కె. బాలకృష్ణంరాజు – ఈసీ (వైద్యం)
ఎస్. మాధవరాజు – ఈసీ (ఎమర్జెన్సీ సేవలు)
పి. ఉదయ్ శంకర్ రెడ్డి – ఈసీ (అవగాహన కార్యక్రమాలు)
ఎస్. శివరాజు – శాంతి కమిటీ అధ్యక్షులు
ఎం. చంద్రమోహన్ రాజు – ఆత్మీయ సహకార అధ్యక్షులు

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులందరూ ప్రమాణ స్వీకారం చేసి, తమ శక్తి వంచన లేకుండా పనిచేస్తూ కోడూరు మానవతా శాఖను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని, మానవతా సంస్థ సిద్ధాంతాలు మరియు సేవలను కోడూరు మండలంలోని పేద మరియు అర్హులైన ప్రజలకు చేరవేస్తామని, అలాగే అధిక సంఖ్యలో సభ్యత్వ నమోదు చేపట్టి సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.
ఈ నూతన కార్యవర్గం 2026–2027 సంవత్సర కాలంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి మానవతా సంస్థ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంకల్పించింది.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

– ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి



పెనగలూరు, సింధూరదర్శిని:వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని పెనగలూరు ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం బెస్తపల్లి కూడలిలో పలు వాహనాల డ్రైవర్లు, ప్రజలకు ఆయన రోడ్డు భద్రత నియమాలు ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వాహన చోదకులు కొన్ని సార్లు రెప్పపాటులో చేసే పొరపాటు వల్ల జరిగే ప్రమాదాల వలన వారి కుటుంబాలు, వాహనంలో ప్రయాణించే కుటుంబాలు చిన్నా బిన్నమై పోతాయాని పలు రకాల ఉదాహరణలతో వివరించి చెప్పారు. అనంతరం ఓబిలి గ్రామంలో గంజాయి, రోడ్డు సేఫ్టీ, మహిళలపై జరిగే అఘాయిత్యాలు, సైబర్ క్రైమ్ పై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా మేడా కుటుంబం

సిద్ధవటం, సింధూరదర్శిని: రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం సిద్ధవటం మండల వైసీపీ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. భాకరాపేట సర్కిల్ లో ఆయన సోదరుడు, ఎంఆర్‌కేఆర్ కన్స్ట్రక్షన్స్ ఎండీ మేడా మధుసూ దన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాధవరం–1 గ్రామ పంచాయతీలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బత్తల మోహన్‌కృష్ణ, మామిళ్ల బాలకుటుంబాలను పరామ ర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే బ్లడ్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న కొత్తమాధవరం గ్రామానికి చెందిన గుంటి ప్రసాద్ కుమారుడు జై కైలాష్ (10సం) వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ మహిళా ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరీరెడ్డి, మండల అధ్యక్షుడు నీలకంఠారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ దేరంగుల శివయ్య, మాజీ సర్పంచ్ కేవీ సుబ్బయ్య, వావిళ్ల శ్రీనివాసులురెడ్డి, మాధవరం–2 వైసీపి గ్రామ అధ్యక్షుడు శ్రీరాందాసు వెంకట్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# వాస్తు శాస్త్రం ప్రకారం ప్రతికూల శక్తి తొలగిపోవాలంటే ఈ చిట్కాలు పాటించండి...






ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్క మనిషి మనసులో మనం అనుకోకుండానే సానుకూల మరియు ప్రతికూల ఆలోచనలు వస్తుంటాయి. మనం ఎంత కోరుకున్నప్పటికీ వాటిని నియంత్రించలేకపోతాం. అయితే మీ మనసులో సానుకూల ఆలోచనలను మరియు ప్రతికూల ఆలోచనల గురించి తెలియజేయడానికి వాస్తు శాస్త్రం ఉపయోగపడుతుంది. వాస్తు శాస్త్రం అనేది ఒక సూక్ష్మ శక్తి. అది మన జీవితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. అయితే వాస్తు శాస్త్రం ప్రకారం, మీ ఇల్లు మరియు మీరు పనిచేసే చోట వాతావరణాన్ని సానుకూలంగా ఉంచుకుంటే, మీ మనసు కూడా సానుకూల ఆలోచనలతో నిండి ఉంటుంది. దీని కారణంగా, మన పని మరియు ప్రవర్తన కూడా మనల్ని సానుకూల జీవితం వైపు నడిపిస్తాయి. ముఖ్యంగా వాస్తుకు సంబంధించి కొన్ని చిట్కాలను పాటిస్తే బెటర్ అండ్ పాజిటివ్ లైఫ్ ను మీ సొంతం చేసుకోవచ్చు. ఇంతకీ ఆ చిట్కాలేంటో చూసేయ్యండి మరి... మిమ్మల్ని ప్రేమించే వారే భాగస్వామి కావాలనుకుంటే... ఈ పరిహారాలను పాటించండి... ప్రధాన ద్వారం వద్ద.. వాస్తు శాస్త్రం ప్రకారం, మీ ఇంట్లోని ప్రధాన ద్వారం శక్తి యొక్క ప్రధాన వనరు. ఈ మార్గం గుండానే మంచి మరియు చెడు శక్తులు ప్రయాణిస్తాయి. మీ ఇంట్లోకి నెగిటివ్ శక్తి రాకుండా ఉండాలంటే, మీ ప్రధాన ద్వారం అతి పెద్దగా ఉండాలి. అలాగే ఇంట్లోని తలుపులను ఎలాంటి శబ్దం లేకుండా పూర్తిగా తెరిచి ఉంచాలి. లోపలి డోర్లను ఎప్పటికీ మూసిఉంచకూడదని గుర్తుంచుకోండి. అలాగే ప్రధాన ద్వారం వద్ద ఎల్లప్పుడు స్వస్తిక్, తోరాణాలు వంటివి అమర్చాలి. దీని వల్ల మనం సానుకూల శక్తిని ఆహ్వానించవచ్చు. ఇంటి లోపల అలంకరణ.. మన శరీరంలో ఉండే రక్తకణాలలో ప్రసరించే శక్తి ఉన్నందున, ఇంటి లోపల అలంకరణ మరియు గాలి కూడా మనపై అదే ప్రభావన్ని చూపుతాయి. సాధారణంగా మన శరీరాన్ని మనం ఎలాగైతే కలుషితం కాకుండా కాపాడుకుంటామో.. అదే విధంగా ఇంట్లోని ప్రతి వస్తువులను ఒక క్రమబద్ధంగా ఉంచుకోవాలి. దీని వల్ల మీ ఇంట్లో శక్తి సానుకూలంగా ఉంచేందుకు సహాయపడుతుంది. ఇంట్లో గాలి యొక్క నిరంతర కదలిక, తగిన కాంతి మరియు వాతావరణంలో నుండి వచ్చే సువాసన ఇంట్లో ముఖ్యమైన శక్తి ఉనికిని సూచిస్తాయి. గాలి కదిలేలా.. మీ ఇంట్లోకి ప్రవేశించే ప్రతికూల శక్తికి పడకగదిలో మంచానికి చాలా అవినాభవ సంబంధం ఉంటుంది. చాలా మంది ప్రజలు మంచం కింద తయారు చేసిన పెట్టేలో వస్తువులను ఉంచుతారు. చాలా సంవత్సరాలుగా ఉపయోగంలో లేని వాటిని ఉంచడం వల్ల ప్రతికూల శక్తిని మీరు ఆహ్వానిస్తున్నట్లే. అలా కాకుండా మీరు మంచం







కింద గాలి వీచడానికి తగినంత స్థలం ఉండేలా చూసుకోవాలి. ఆ ఆలయంలోని మంటలను ప్రత్యక్షంగా చూస్తే.. పక్షవాతం నయమవుతుందట...! పాత వస్తువులను.. మీ ఇంట్లో పాత బొమ్మలను మరియు ఇంట్లో ఏవైనా దుమ్ముగా ఉండే వస్తువులను నిల్వ ఉంచినప్పుడు కూడా ప్రతికూల శక్తి వాటిలో పేరుకుపోతుంది. పాత గడియారాలు, సంగీత వాయిద్యాలు, మొబైల్ ఫోన్లు మరియు ఇతర గ్యాడ్జెట్లను ఇంటి వెలుపల ఉంచాలి. లేదా వాటిని పారవేయడం మంచిది. పాత వస్తువుల వల్ల శక్తి కలుషితం అవుతుంది. ఇంకా కొంతమంది ఇళ్లలో బూట్లు మరియు చెప్పులను మంచం కింద ఉంచుతారు. అది కూడా ఇంట్లోని వాస్తు లోపాలను సూచిస్తుంది. సానుకూల శక్తి కోసం.. మీ ఇంట్లో సానుకూల శక్తి ప్రవేశించడానికి మీరు ఇంటికి ఆగ్నేయంలో లేదా వాయువ్యంలో ఉన్న వంటగది ఇంటికి సానుకూల శక్తిని నింపుతుంది. ఏదైనా ఆహారం తయారు చేసేటప్పుడు, ఇంటి లక్ష్మి తన ముఖంతో తూర్పు వైపు ఆహారాన్ని సిద్ధం చేస్తే, మీ ఇంటికి సానుకూల శక్తి ఆ ఆహారం ద్వారా వస్తుంది. అది మీ శరీరంలోకి కలిసిపోతుంది. ప్రతికూల శక్తి నాశనమయ్యేందుకు.. వాస్తు శాస్త్రం ప్రకారం ప్రతికూల శక్తి మీ ఇంటి వరకు రాకుండా, మీరు మీ ఇంటి ప్రాంగణంలో లేదా బాల్కనీలో చంపా చెట్టును నాటడం వంటివి చేయాలి. ఇది మీ ఇంటికి సానుకూల శక్తిని ఇస్తుంది. అదే సమయంలో మీ ఇంటి నుండి ప్రతికూల శక్తిని కూడా తొలగిస్తుంది. ఇలాంటి చిన్న చిన్న సులభమైన పనులతో మీ ఇంటిని సానుకూల శక్తికి కేంద్రంగా మార్చడం ద్వారా మీరు పురోగతి మార్గంలో పయనించవచ్చు.






## ఆయుర్వేద వైద్యముతో సకల రోగాలు దూరం : ట్రస్ట్ అధినేత అబ్దుల్ సుబహాన్

ఒంటిమిట్ట సింధూరదర్శిని: ఆయుర్వేద వైద్యముతో సకల రోగాలు దూరం అవుతాయని నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్ అన్నారు.ఒంటిమిట్ట మండలం మలకాటిపల్లి గ్రామ శివారులో ఉన్న మదరసా నందు శనివారం పేదలకు ఆర్థిక సహాయం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లాం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి విద్యార్థులకు విద్యను అందించ డంతోపాటు, వసతులను కల్పించడం జరుగుతోందని తెలిపారు ఉమ్మడి కడప జిల్లాలోని పలు మండలాలలో ఉన్న పేద ప్రజలకు శనివారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

పెన్షన్ రూపంలో నగదును అందజేస్తూ వారికి ఒక తోడుగా నిలిచారు. కరోనా సమయంలో గ్రామాల వద్దకు వెళ్లి కూరగా యలు, నిత్యావసర సరుకులను పంపిణీ చేసి వారికి చేదోడుగా నిలిచారు. ఇమాములను, మౌజాములను ఆదుకుంటూ వారికి అండగా నిలిచారు. ఆయుర్వేద పరిశ్రమను ఏర్పాటు చేసి ప్రజలకు మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రజలకు



సేవ చేయడమే తన అభిమతం అని, ప్రతి ఒక్క వ్యక్తి తన వద్ద ఉన్న సంపదలో కొద్ది వరకు పేదలకు సహాయం చేయడానికి వినియోగించాలని వారు కోరారు. పేదలకు సేవ చేయడంలో పరమార్థం ఉందని, అలాంటి వారు మోక్ష ప్రాప్తి పొందుతారని అన్నారు. ఆయుర్వేద పరిశ్రమ మరింత అభివృద్ధి చెందడానికి ప్రజల సహాయ సహకారాలు అవసరమని, తమవంతుగా దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత దశాబ్దాల కాలం నుండి పేదలకు సేవ చేయడంతోనూ, ఆయుర్వేద పరంగా ప్రజలకు సేవలు అందించడంలోనూ అనేక సంస్థలు గుర్తించి అనేక ప్రశంసాపత్రాలను కూడా అందించాయి.

# బరువు తగ్గాలనుకునేవారు పీనట్ బటర్ తినొచ్చా?

రెండు స్పూన్ల పీనట్ బటర్‌లో 190-200 క్యాలరీలు

ప్రొటీన్, ఫైబర్, మంచి కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి

ఎక్కువసేపు ఆకలి వేయకుండా సహాయపడుతుంది

రోజుకు 1-2 టేబుల్ స్పూన్లకే పరిమితం కావాలి

బరువు తగ్గే డైట్‌లో మితంగా తీసుకుంటే ఉపయోగకరం



బరువు తగ్గాలంటే తక్కువ క్యాలరీలు తీసుకోవాలి. ఎక్కువ క్యాలరీలు ఖర్చు చేయాలి. అందుకే చాలా మంది ఆహారంలో క్యాలరీల లెక్కలు చూసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో పీనట్ బటర్ ఆరోగ్యకరమా? బరువు తగ్గే డైట్‌లో చేర్చుకోవచ్చా? అనే సందేహం చాలామందిలో ఉంటుంది. పీనట్ బటర్‌లో ప్రొటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేసి కడుపు నిండిన భావన కలిగిస్తాయి. అందువల్ల తరచూ తినాలనే కోరిక తగ్గుతుంది. అయితే ఇందులో క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల పీనట్ బటర్‌లోనే సుమారు 190-200 క్యాలరీలు ఉంటాయి. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం, పరిమిత మోతాదులో తీసుకుంటే పీనట్ బటర్ బరువు తగ్గే ప్రయాణానికి అడ్డంకి కాదు. ఇందులోని ప్రొటీన్, ఫైబర్, మంచి కొవ్వులు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. అలాగే ఎక్కువసేపు శక్తిని అందించి ఆకలి నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. పీనట్ బటర్‌ను రోజుకు ఒకటి లేదా రెండు టేబుల్ స్పూన్లకే పరిమితం కావడం మంచిది. అలాగే అదనపు చక్కెరలు, హైడ్రోజనేటెడ్ ఆయిల్స్ కలిపిన ఉత్పత్తుల కంటే సహజ పీనట్ బటర్‌ను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. యాపిల్ ముక్కలు, హోల్‌గ్రెయిన్ బ్రెడ్ లేదా ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలతో కలిపి తీసుకుంటే మరింత ప్రయోజనం ఉంటుంది.

# యూపీఐ యూజర్లకు అలర్ట్.. పాత అకౌంట్లు అలాగే ఉంచొద్దు!

-కొత్త ఖాతా జోడిస్తే పాతది తొలగదు


-వాడని ఖాతాలతో సమస్యలు

-రిఫండ్‌లు ఆలస్యమయ్యే అవకాశం

-ఆటోపే చెల్లింపులపై ప్రభావం

-యాప్‌లోనే ఖాతా తొలగించే వీలు

-అవసరమైతే మళ్లీ లింక్ చేసుకోవచ్చు




డిజిటల్ చెల్లింపులు పెరిగిన తర్వాత యూపీఐ చాలా మందికి రోజువారీ జీవితంలో భాగమైంది. డబ్బు పంపాలన్నా, బిల్లు చెల్లించాలన్నా యూపీఐనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. అయితే బ్యాంక్ ఖాతా మార్చిన తర్వాత చాలామంది ఒక చిన్న విషయాన్ని మర్చిపోతున్నారు. అదే పాత బ్యాంక్ ఖాతాను యూపీఐ యాప్‌లో అలాగే ఉంచడం.

**కొత్త అకౌంట్ జోడిస్తే**

యూపీఐలో ఒకే మొబైల్ నంబర్‌కు ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలను లింక్ చేసే అవకాశం ఉంటుంది. కొత్త బ్యాంక్ ఖాతా జోడిస్తే పాతది ఆటోమేటిక్‌గా తొలగిపోదు. అది కూడా యాప్‌లో కనిపిస్తూనే ఉంటుంది. అందుకే అవసరం లేని అకౌంట్లను స్వయంగా తొలగించాలి. వాడని బ్యాంక్ ఖాతా యూపీఐలో ఉంటే కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆ ఖాతా ఇక యాక్టివ్‌లో లేకపోతే లావాదేవీలు విఫలమవుతాయి. రిఫండ్‌లు ఆలస్యమయ్యే అవకాశం ఉంటుంది. కొన్ని ఆటో డెబిట్ చెల్లింపులు కూడా ప్రభావితమవుతాయి.

**గందరగోళం**

ఒకే యాప్‌లో చాలా బ్యాంక్ ఖాతాలు కనిపిస్తే ఏ ఖాతా ప్రస్తుతం ఉపయోగంలో ఉందో గుర్తించడం కష్టమవుతుంది. ముఖ్యంగా వృద్ధులు లేదా డిజిటల్ చెల్లింపులకు కొత్తగా అలవాటు పడుతున్న వారికి ఇది గందరగోళం కలిగించవచ్చు. అందుకే ప్రస్తుతం వాడుతున్న ఖాతాలను మాత్రమే ఉంచడం మంచిది.

**పాత ఖాతాను ఎలా తొలగించాలి?**

యూపీఐ యాప్‌లో ప్రొఫైల్ లేదా బ్యాంక్ అకౌంట్స్ విభాగానికి వెళ్లాలి. అక్కడ లింక్ అయిన అన్ని బ్యాంక్ ఖాతాలు కనిపిస్తాయి. తొలగించాలనుకున్న అకౌంట్‌ను ఎంచుకుని 'రిమూవ్' లేదా 'అన్‌లింక్' ఆప్షన్‌ను ఎంపిక చేయాలి. దీంతో ఆ ఖాతా యూపీఐ నుంచి తొలగిపోతుంది. భవిష్యత్తులో అవసరం వస్తే దాన్ని మళ్లీ యాప్‌లో జోడించవచ్చు.

**ఈ విషయాలు గుర్తుంచుకోండి**

బ్యాంక్ ఖాతా మార్చిన తర్వాత యాక్టివ్ ఆటోపేలు, ఈఎంఐలు, సబ్‌స్క్రిప్షన్లు ఏ ఖాతాకు లింక్ అయ్యాయో ఒకసారి చెక్ చేయాలి. అలాగే కొంతకాలానికోసారి యూపీఐలో ఉన్న బ్యాంక్ ఖాతాల జాబితాను పరిశీలించడం మంచిది. అవసరం లేని ఖాతాలను తొలగిస్తే యాప్ వినియోగం సులభంగా ఉంటుంది. పొరపాట్లకు అవకాశాలు తగ్గుతాయి.

# 20 ఏళ్లకే అద్భుతం.. యంగెస్ట్ ఐరన్‌మ్యాన్‌గా ఐఐటీ మద్రాస్ విద్యార్థిని!

ఐరన్‌మ్యాన్‌గా నిలిచిన 20 ఏళ్ల ఐఐటీ మద్రాస్ విద్యార్థిని రేనీ నొరోన్హా

ఫిలిప్పీన్స్‌లో జరిగిన పోటీలో విజయం, వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత

18 ఏళ్లకే తొలిసారి ఐరన్‌మ్యాన్ పూర్తి చేసి రికార్డు సృష్టించిన ఘనత

21 ఏళ్లు నిండకముందే గిన్నిస్ రికార్డు నెలకొల్పడమే లక్ష్యం




భారత క్రీడా రంగంలో ఓ యువ సంచలనం సరికొత్త చరిత్ర సృష్టించింది. కేవలం 20 ఏళ్ల వయసులోనే ఐఐటీ మద్రాస్ విద్యార్థిని రేనీ నొరోన్హా, 'భారతపు అతి పిన్న వయస్కురాలైన మహిళా ఐరన్‌మ్యాన్'గా అరుదైన ఘనత సాధించింది. పట్టుదల, కృషి ఉంటే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తూ, ఆమె నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల ఫిలిప్పీన్స్‌లో జరిగిన 'సెంచరీ ట్యూనా ఐరన్‌మ్యాన్' పోటీలో రేనీ తన సత్తా చాటింది. 18-24 ఏళ్ల వయసు కేటగిరీలో 15 గంటల 55 నిమిషాల 37 సెకన్లలో రేసును పూర్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ విజయంతో 2026లో హవాయిలో జరగనున్న ప్రతిష్ఠాత్మక ఐరన్‌మ్యాన్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది. ఐరన్‌మ్యాన్ అనేది 3.8 కిలోమీటర్ల స్విమ్మింగ్, 180 కిలోమీటర్ల సైక్లింగ్, 42.2 కిలోమీటర్ల మారథాన్‌తో కూడిన అత్యంత కఠినమైన పోటీ.

రేనీ ఈ ఘనత సాధించడం ఇదే తొలిసారి కాదు. 2023లో 18 ఏళ్ల 49 రోజుల వయసులోనే న్యూజిలాండ్‌లో ఐరన్‌మ్యాన్ రేసును పూర్తి చేసి, ఈ పోటీని ముగించిన అతి పిన్న వయస్కురాలైన భారతీయ మహిళగా రికార్డు సృష్టించింది. ఒకప్పుడు ప్రొఫెషనల్ ఆర్టిస్టిక్ జిమ్నాస్ట్‌గా రాణించిన ఆమె, 16 ఏళ్ల వయసులో క్రీడల వైపు అడుగులు వేసింది. ప్రస్తుతం లండన్‌లో ఉంటూనే ఐఐటీ మద్రాస్‌లో బీఎస్సీ డేటా సైన్స్ అండ్ అప్లికేషన్స్ కోర్సును రిమోట్ విధానంలో చదువుకుంటోంది. 21ఏళ్లు నిండకముందే ఆరుఖండాల్లో ఐరన్‌మ్యాన్ పోటీలను పూర్తి చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పడమే తన లక్ష్యమని రేనీ చెబుతోంది. చదువు, క్రీడలు రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ఆమె సాధిస్తున్న విజయాలు ఎందరికో స్ఫూర్తినిస్తున్నాయి.

# పెట్రోల్, డీజిల్ ధరల ఎఫెక్ట్.. ఈవీ షోరూంలకు క్యూ కట్టిన జనం...

-డెలివరీలు ఇవ్వలేక కంపెనీల ఆపసోపాలు!

-పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ఎలక్ట్రిక్ కార్లకు భారీ గిరాకీ

-ప్రముఖ కంపెనీల ఈవీ మోడళ్ల డెలివరీకి మూడు నెలల వరకు వెయిటింగ్

-పశ్చిమాసియా సంక్షోభంతో నాలుగేళ్ల తర్వాత భారీగా పెరిగిన ఇంధన ధరలు

-మే నెలలో రికార్డు స్థాయిలో 26,000 దాటిన ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు

-డిమాండ్‌కు తగినట్టు ఉత్పత్తిని పెంచేందుకు కంపెనీల ప్రయత్నాలు



దేశంలో ఇంధన ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా ఈవీ కార్లకు ఒక్కసారిగా గిరాకీ పెరిగి, డెలివరీ కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. మారుతి సుజుకి, టాటా మోటార్స్, మెర్సిడెస్-బెంజ్, మహీంద్రా వంటి ప్రముఖ కంపెనీల పాపులర్ మోడళ్ల కోసం ప్రస్తుతం మూడు నెలల వరకు వెయిటింగ్ పీరియడ్ నడుస్తోంది.

పశ్చిమాసియాలో నెలకొన్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతల కారణంగా గత నాలుగేళ్లలో తొలిసారిగా పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయి. ఢిల్లీ సహా పలు ప్రధాన నగరాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.100 మార్కును దాటింది. ఈ పరిణామం ఎలక్ట్రిక్ వాహన పరిశ్రమకు కీలక మలుపుగా మారింది. ఇప్పటివరకు అధిక ధరలు, ఛార్జింగ్ సదుపాయాల కొరత వంటి కారణాలతో ఈవీల కొనుగోలుకు వెనుకాడిన వినియోగదారులు, ఇప్పుడు వాటిపైనే ఆసక్తి కనబరుస్తున్నారు.

మార్చి నెల నుంచి తమ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల (బీఈవీ) డిమాండ్ 40 శాతం మేర పెరిగిందని మెర్సిడెస్-బెంజ్ ఇండియా వెల్లడించింది. ఏప్రిల్‌లో విడుదలైన సీఎల్ఏ బీఈవీ మోడల్‌కు రెండు నుంచి మూడు నెలల వెయిటింగ్ పీరియడ్ సమయం ఉందని, దీనివల్ల డీలర్లు కొత్త బుకింగ్స్‌ను నిలిపివేశారని కంపెనీ ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. బీఎండబ్ల్యూ ఇండియా సైతం ఇదే తరహా పరిస్థితులను ఎదుర్కొంటోంది. మేనెలలో ఆ కంపెనీ మొత్తం అమ్మకాల్లో ఈవీల వాటా 33 శాతానికి చేరుకోవడం విశేషం. దేశీయ దిగ్గజ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకికి చెందిన కొత్త ఈ-విటారా ఎస్‌యూవీ బుకింగ్స్ గత నెలలో రెట్టింపయ్యాయని, దీంతో 6 నుంచి 8 వారాల నిరీక్షణ తప్పడం లేదని కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ వివరించారు. అదేవిధంగా మహీంద్రా ఎక్స్‌యూవీ 9ఈ మోడల్‌కు 6 నుంచి 8 వారాలు, టాటా మోటార్స్ పంచ్, టియాగో ఈవీలకు సుమారు 6 వారాల వెయిటింగ్ పీరియడ్ కొనసాగుతోంది.

2026 మేలో ఎలక్ట్రిక్ కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 26,000 యూనిట్లను దాటాయి. ఇది గతేడాదితో పోలిస్తే 80శాతం అధికం కావడం గమనార్హం. మొత్తం ప్యాసింజర్ వాహనాల్లో ఈవీల వాటా తొలిసారిగా 11 శాతాన్ని అధిగమించింది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిని పెంచేందుకు ఆటోమొబైల్ సంస్థలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నప్పటికీ, సరఫరా వ్యవస్థలో తలెత్తిన సమస్యలు సవాలుగా మారాయి. ఇంధన ధరల అనిశ్చితి నేపథ్యంలో, ఆర్థికంగా పొదుపు మార్గంగా వినియోగదారులు సహజంగానే ఈవీల వైపు ఆకర్షితులవుతున్నారు.

# చంద్రబాబు, లోకేష్ వీడియోలతో దోచేసిన సైబర్ నేరగాళ్లు

ఏఐతో దోపిడీలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు

డీప్‌ఫేక్ వీడియోల ద్వారా

రూ. 80వేలు దోచేసిన వైనం

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన

వైజాగ్ వ్యక్తి



అమరావతి, సింధూరదర్శిని:ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత ఎంతలా అభివృద్ధి చెందుతోందో తెలిసిందే. దానిని అడ్డం పెట్టుకుని సైబర్ నేరగాళ్లు ప్రమాదకరమైన మోసాలకు తెరలేపుతున్నారు. ఏకంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ల 'డీప్‌ఫేక్' వీడియో కాల్స్‌ను సృష్టించి విశాఖపట్నానికి చెందిన ఒక సామాన్య వ్యక్తిని రూ. 80 వేలకు ముంచేసిన షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. సాంకేతికతను వాడుకుని కేటుగాళ్లు ఎంత పక్కాగా స్కెచ్ వేశారో ఈ వివరాలు చూస్తే అర్థమవుతుంది. విశాఖపట్నం సీతంపేటకు చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తికి ఒక భూమి సమస్య ఉంది. దానిని పరిష్కరించాలంటూ ఆయన మంత్రి నారా లోకేష్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. దీనిని గమనించిన సైబర్ దొంగలు మరుసటి రోజే వాట్సాప్ ద్వారా శ్రీనివాస్ రెడ్డిని కాంటాక్ట్ చేశారు. నమ్మకం కుదర్చడం కోసం మాజీ మంత్రి దేవినేని ఉమా ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టుకున్నారు. మీ సమస్య సీఎంఓ దాకా వెళ్లిందని, త్వరలోనే పరిష్కారమవుతుందని నమ్మబలికారు. బాధితుడికి ఇంకాస్త గట్టి నమ్మకం కలిగించడం కోసం నేరగాళ్లు ఏఐ (ఏఐ) టెక్నాలజీని ఉపయోగించి ఒక వీడియో కాల్ చేశారు. ఆ కాల్‌లో సాక్షాత్తూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కూర్చుని, తన సమస్యను పరిష్కరిస్తామని స్వయంగా హామీ ఇస్తున్నట్లు ఆ వీడియోను మార్ఫింగ్ చేశారు. ఆ వీడియో కాల్ చూసిన శ్రీనివాస్ రెడ్డి... నిజంగానే ముఖ్యమంత్రే తనతో మాట్లాడుతున్నారని నమ్మి మైమరచిపోయారు. ఆ తర్వాత అసలు రంగు బయటపెట్టిన కేటుగాళ్లు.. ఈ ల్యాండ్ ఇష్యూ కాస్త కాంప్లికేటెడ్‌గా ఉందని, దీనిని సెటిల్ చేయాలంటే కొంత ఖర్చవుతుందని నమ్మబలికారు. బాధితుడి నుంచి విడతల వారీగా దాదాపు 80 వేల రూపాయలను ఆన్‌లైన్ ద్వారా గుంజేశారు. డబ్బులు పంపిన తర్వాత అవతలి వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేకపోవడంతో, తాను దారుణంగా మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్ రెడ్డి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.పోలీసులు కేసు నమోదు చేసి ఈ హైటెక్ మోసంపై దర్యాప్తు ప్రారంభించారు. టెక్నాలజీ పెరిగేకొద్దీ నేరాల శైలి కూడా ఎలా మారుతోందో చెప్పడానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ. సోషల్ మీడియాలో మీ వ్యక్తిగత సమస్యలను, ఫోన్ నంబర్లను పెట్టేటప్పుడు.. అలాగే గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో ఈ ఘటన హెచ్చరిస్తోంది.

# జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు మంజూరుకు చేయాలని ముక్కు రూపానందరెడ్డికి విలేకరుల వినతి

పెనగలూరు, సింధూరదర్శిని: జర్నలిస్ట్ లకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని పెనగలూరు మండల పాత్రికేయులు రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, కుడా చైర్మెన్ ముక్కా రూపానందరెడ్డి కి వినతి పత్రం ఇచ్చారు. శనివారం ఉదయం రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముక్కా రూపానంద రెడ్డి నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో పెనగలూరు మండలం విలేఖర్లు తమకు ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. ఈ సందర్భంగా ముక్కా రూపానందరెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వం, అధికారుల దృష్టికి సమస్యను తీసుకు వెళ్ళి జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతగాని నాగయ్య, దాసరి సుధాకర్, కుంచం జయరామయ్య, ఈది.శివ కుమార్, ముద్దల మధు, ఆకుల హరి కృష్ణ, సోమేసుల శివ పాల్గొన్నారు.



# మనుషులు ఎవరిని ఎక్కువగా నమ్ముతారో తెలుసా?

స్థిరమైన ప్రవర్తనే నమ్మకానికి ఆధారం
మాటలు, చేతలు ఒకేలా ఉండాలి
చిన్న హామీలు కూడా నిలబెట్టుకోవాలి
తప్పులను నిజాయతీగా అంగీకరించాలి
భావోద్వేగాలపై నియంత్రణ అవసరం



మనిషి జీవితంలో సంపాదించడానికి కష్టమైన వాటిలో నమ్మకం ఒకటి. స్నేహాలు, కుటుంబ బంధాలు, ఉద్యోగ జీవితం.. ప్రతిచోటా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. అయితే కొందరిని చూస్తే కొత్తగా పరిచయం అయినా త్వరగా నమ్మకం కలుగుతుంది. మరికొందరిపై మాత్రం చాలా కాలం గడిచినా పూర్తిగా విశ్వాసం ఏర్పడదు. దీనికి కారణం ఏమిటనే ప్రశ్నకు సైకాలజీ ఆసక్తికరమైన సమాధానం చెబుతోంది.

**తెలివి కాదు..**

చాలామంది నమ్మకం సంపాదించాలంటే తెలివిగా ఉండాలని భావిస్తారు. ఇంకొందరు ఆత్మవిశ్వాసం లేదా ఆకట్టుకునే వ్యక్తిత్వమే కారణమని అనుకుంటారు. కానీ సైకాలజీ నిపుణుల అభిప్రాయం వేరేలా ఉంది. ఒక వ్యక్తి మాటకు కట్టుబడి ఉండటం, ప్రవర్తనలో స్థిరత్వం చూపించడం నమ్మకాన్ని పెంచే ప్రధాన అంశమని చెబుతున్నారు.

**చెప్పింది చేస్తేనే**

మనకు అత్యంత నమ్మకమైన వ్యక్తులను ఒకసారి గుర్తు చేసుకుంటే ఒక విషయం స్పష్టమవుతుంది. వారు తప్పనిసరిగా అత్యంత తెలివైనవారే కావాల్సిన అవసరం లేదు. కానీ చెప్పిన మాట నిలబెట్టుకుంటారు. సహాయం చేస్తానంటే చేస్తారు. వస్తానంటే వస్తారు. వారి ప్రవర్తనలో స్థిరత్వం ఉండటం వల్లే వారిపై విశ్వాసం పెరుగుతుంది.

**మెదడు అంచనా ఇదే**

ఎదుటి వ్యక్తిని కలిసిన ప్రతిసారీ మన మెదడు ఒక ప్రశ్న వేసుకుంటుంది. "ఈ వ్యక్తిని నమ్మవచ్చా?" అని. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వడంలో స్థిరమైన ప్రవర్తన కీలకంగా మారుతుంది. ఒకరోజు ఒకలా, మరో రోజు మరోలా ప్రవర్తించే వారిని అర్థం చేసుకోవడం కష్టం. అలాంటి పరిస్థితుల్లో నమ్మకం ఏర్పడటానికి ఎక్కువ సమయం పడుతుంది.

**చిన్న చిన్న పనులే**

నమ్మకం ఒక్కరోజులో ఏర్పడదు. అది చిన్న చిన్న చర్యలతో పెరుగుతుంది. సమయానికి రావడం, ఇచ్చిన హామీలను నెరవేర్చడం, బాధ్యతగా వ్యవహరించడం వంటి విషయాలు ఎదుటివారికి భరోసా కలిగిస్తాయి. ఈ వ్యక్తిపై ఆధారపడొచ్చనే భావన క్రమంగా బలపడుతుంది.

**తప్పులు చేసినా సమస్య కాదు**

చాలామంది నమ్మకం పొందాలంటే ఎప్పుడూ తప్పులు చేయకూడదని అనుకుంటారు. కానీ పరిశోధనలు వేరే విషయాన్ని చెబుతున్నాయి. పొరపాటు జరిగినా దాన్ని నిజాయతీగా అంగీకరిస్తే చాలా మంది క్షమిస్తారు. కానీ ఒకటి చెప్పి మరొకటి చేయడం మాత్రం నమ్మకాన్ని దెబ్బతీస్తుంది.

**రెండు ముఖాలు**

బయట ఒకలా, వ్యక్తిగతంగా మరోలా ప్రవర్తించే వారిపై అనుమానాలు పెరుగుతాయి. నిజాయతీ గురించి మాట్లాడుతూనే అబద్ధాలు చెప్పడం కూడా అదే ప్రభావం చూపుతుంది. మాటలు, చేతలు ఒకే దారిలో లేకపోతే విశ్వాసం క్రమంగా తగ్గిపోతుంది.

**భావోద్వేగాలపై నియంత్రణ**

ప్రతి చిన్న విషయానికి తీవ్రంగా స్పందించే వ్యక్తులతో మాట్లాడేటప్పుడు చాలామందికి అసౌకర్యంగా ఉంటుంది. కానీ పరిస్థితులకు తగ్గట్టు ప్రశాంతంగా స్పందించే వారితో తమ ఆలోచనలు పంచుకోవడానికి ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఇదీ నమ్మకాన్ని పెంచే మరో అంశమే.

**నిజమైన వ్యక్తిత్వానికి అదే గుర్తు**

వ్యక్తి విలువలు, మాటలు, పనులు ఒకే దిశలో ఉంటే దాన్ని సమగ్రతగా భావిస్తారు. అలాంటి వారిని ప్రజలు సహజంగా విశ్వసిస్తారు. సోషల్ మీడియా యుగంలో ఆకర్షణీయమైన ఇమేజ్ సృష్టించడం సులభమే. కానీ దీర్ఘకాలంలో ప్రజలు గమనించేది ప్రవర్తనలోని స్థిరత్వాన్నే.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..

-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వాంగ్మూలం నమోదు
-తుమ్మల నివాసానికి వెళ్లి వాంగ్మూలాన్ని నమోదు చేసిన సిట్
-తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు
-తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్



హైదరాబాద్, సింధూరదర్శిని: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం. కొందరు ఇంటెలిజెన్స్ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేయడంతో పాటు, ఆయన కదలికలను ట్రాక్ చేసి వ్యక్తిగత సంభాషణలను పర్యవేక్షించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మంత్రి నివాసంలో జరిగిన విచారణ సందర్భంగా ఆయన ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా, వ్యక్తిగత కమ్యూనికేషన్లపై జరిగిన నిఘాకు సంబంధించి సిట్ అధికారులు పలు వివరాలు సేకరించారు. బాధితుడిగా తుమ్మల ఇచ్చిన వాంగ్మూలం కేసు దర్యాప్తులో కీలక ఆధారంగా మారే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో గత ప్రభుత్వానికి చెందిన పలువురు సీనియర్ అధికారులు న్యాయపరమైన కస్టడీలో ఉన్నారు. తాజాగా మంత్రి తుమ్మల వాంగ్మూలం నమోదు కావడంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సిట్ దర్యాప్తు వేగవంతం కావడంతో రానున్న రోజుల్లో మరికొంతమంది రాజకీయ నాయకులు, అధికారులకు నోటీసులు జారీ అయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## భారత్-పాక్ మ్యాచ్ అంటే అదే ఒత్తిడి.. వాచ్‌మన్ మాట గుర్తుచేసిన జెమీమా



"ఎవరితో మ్యాచ్‌లో అయినా ఓడిపోవచ్చు కానీ పాకిస్థాన్‌తో మాత్రం ఓడిపోవద్దు" అని తన బిల్డింగ్ వాచ్‌మన్ కూడా తనతో అన్నాడని టీమిండియా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వెల్లడించింది. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ అంటే ఎంతటి తీవ్రమైన ఒత్తిడి ఉంటుందో అర్థం చేసుకోవడానికి ఇదొక నిదర్శనమని ఆమె వ్యాఖ్యానించింది. మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆదివారం (జూన్ 14) పాకిస్థాన్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌కు ముందు ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. బర్మింగ్‌హామ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌తో ఇరు జట్లూ తమ ప్రపంచకప్ ప్రస్థానాన్ని ప్రారంభించనున్నాయి. ఈ నేపథ్యంలో జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెమీమా మాట్లాడుతూ, "భారత్-పాక్ మ్యాచ్‌ల చరిత్ర, అభిమానుల అంచనాల వల్ల బయటి నుంచి ఒత్తిడి ఉంటుందన్నది వాస్తవం. దీన్ని మనం కాదనలేం" అని హర్మన్‌ప్రీత్ కౌర్ డ్రెస్సింగ్ రూమ్‌లో తమతో చెబుతుంటుందని జెమీమా గుర్తుచేసుకుంది. అయితే, ఈ ఒత్తిడిని అధిగమించి దీర్ఘకాలిక లక్ష్యాలపై దృష్టి పెట్టడానికి జట్టు పక్కా ప్రణాళికతో సిద్ధమవుతోందని ఆమె వివరించింది. జట్టు సన్నద్ధతలో కోచ్ అమోల్ మజుందార్ కీలక పాత్ర పోషిస్తున్నాడని తెలిపింది. 2025 వన్డే ప్రపంచకప్‌ను గెలిచిన స్ఫూర్తితో ఆడతామని వ్యాఖ్యానించింది. ప్రతి మ్యాచ్‌కు విభిన్న వ్యూహాలతో సన్నద్ధమవుతామని వెల్లడించింది. ముఖ్యంగా జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు ఒత్తిడిని తట్టుకుని ఎలా రాణించాలో ప్రత్యేకంగా శిక్షణ పొందుతున్నామని జెమీమా పేర్కొంది.

# మన కాళ్ల కింద మరో ప్రపంచం..

## తొలిసారిగా మ్యాప్‌ను రూపొందించిన శాస్త్రవేత్తలు!

భూమి లోపల 110 క్వాడ్రిలియన్ కిలోమీటర్ల పొడవైన శిలీంధ్రాల నెట్‌వర్క్‌ను గుర్తించిన శాస్త్రవేత్తలు
మొక్కల మనుగడకు, పర్యావరణ సమతుల్యతకు ఈ నెట్‌వర్క్ అత్యంత కీలకం
వాతావరణంలోని కర్బనాన్ని భూమిలో నిల్వ చేయడంలో దీనిది ప్రధాన పాత్ర
ఆధునిక వ్యవసాయ పద్ధతుల వల్ల ఈ భూగర్భ నెట్‌వర్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతోందని హెచ్చరిక




భూ ఉపరితలం కింద కంటికి కనిపించని ఒక అద్భుత ప్రపంచం ఉందని, మన గ్రహం మనుగడకు ఇది అత్యంత కీలకమని శాస్త్రవేత్తలు గుర్తించారు. భూగర్భంలో విస్తరించి ఉన్న ఈ సూక్ష్మ శిలీంధ్రాల వ్యవస్థ (ఫంగల్ నెట్‌వర్క్) మొత్తం పొడవు సుమారు 110 క్వాడ్రిలియన్ కిలోమీటర్లు ఉంటుందని అంచనా. అంటే, ఇది భూమికి సూర్యుడికి మధ్య ఉన్న దూరానికి దాదాపు వంద కోట్ల రెట్లు అధికం. ఈ ఆవిష్కరణకు సంబంధించిన సమగ్ర మ్యాప్‌ను శాస్త్రవేత్తలు తొలిసారిగా విడుదల చేశారు. 'ఆర్బస్కులర్ మైకోరైజల్' (ఏఎం)గా పిలిచే ఈ శిలీంధ్రాలు భూమిపై ఉన్న సుమారు 70 శాతం మొక్కలతో సహజీవన సంబంధాన్ని కొనసాగిస్తాయి. కిరణజన్య సంయోగక్రియ ద్వారా మొక్కలు తయారు చేసుకున్న చక్కెరలను ఇవి స్వీకరిస్తూ అందుకు ప్రతిఫలంగా తమ దారాల వంటి నిర్మాణాలను వేర్ల కంటే సుదూరంగా విస్తరించి, మొక్కలకు అవసరమైన నీరు, ఫాస్పరస్, నైట్రోజన్ వంటి పోషకాలను అందిస్తాయి. దీనిని శాస్త్రీయంగా 'వుడ్ వైడ్ వెబ్' అని కూడా వ్యవహరిస్తారు. 'సొసైటీ ఫర్ ది ప్రొటెక్షన్ ఆఫ్ అండర్‌గ్రౌండ్ నెట్‌వర్క్స్' (ఎస్పీయూఎన్) నేతృత్వంలోని పరిశోధకులు ప్రపంచవ్యాప్తంగా 16,000కు పైగా మట్టి నమూనాలను విశ్లేషించి ఈ మ్యాప్‌ను రూపొందించారు. ఈ అధ్యయనం వివరాలు ప్రతిష్ఠాత్మక 'సైన్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ భూగర్భ నెట్‌వర్క్ సుమారు 300 మెగాటన్నుల కార్బన్‌ను నిల్వ చేసుకుందని, ఇది భూమిపై ఉన్న మొత్తం మానవ జాతి బరువు కంటే నాలుగు నుంచి ఆరు రెట్లు ఎక్కువని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయితే, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, రసాయన ఎరువుల అతి వినియోగం, భూమిని విపరీతంగా దున్నడం వంటి కారణాల వల్ల ఈ సహజ నెట్‌వర్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లుతోందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన ప్రాంతాలతో పోలిస్తే వ్యవసాయ భూముల్లో ఈ శిలీంధ్రాల సాంద్రత 50 శాతం తక్కువగా ఉన్నట్లు గుర్తించారు.

ఈ భూగర్భ నెట్‌వర్క్‌ను పరిరక్షించడం ద్వారా ఆహార భద్రత, జీవవైవిధ్యం, వాతావరణ మార్పుల నియంత్రణ వంటి కీలక లక్ష్యాలను సాధించవచ్చని వారు సూచిస్తున్నారు.

# టీమిండియా-ఆఫ్ఘనిస్థాన్ తొలి వన్డే.. ఎట్టకేలకు ప్రారంభమైంది!

ధర్మశాలలో భారత్, ఆఫ్ఘనిస్థాన్ తొలి వన్డే - వర్షం కారణంగా ఆలస్యంగా ప్రారంభం
టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్ - ఓవర్లు 25కి కుదింపు

ధర్మశాల వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో తొలి వన్డే మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మొదట బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ జట్టు తొలుత బ్యాటింగ్ చేయనుంది. భారీ వర్షం కారణంగా బాగా ఆలస్యంగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో, వాతావరణం బౌలర్లకు అనుకూలించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఓవర్లను 25కి కుదించారు. ఈ సిరీస్‌లో యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ భారత జట్టుకు నాయకత్వం వహిస్తున్నాడు. సీనియర్ ఆటగాడు రోహిత్ శర్మ ఈ మ్యాచ్ ద్వారా జట్టులోకి తిరిగి వచ్చాడు. భారత తుది జట్టులో ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్‌లకు చోటు దక్కింది. యువ ఆటగాళ్లు నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ కూడా జట్టులో స్థానం సంపాదించారు. మరోవైపు, హష్మతుల్లా షాహిది కెప్టెన్సీలోని ఆఫ్ఘనిస్థాన్ జట్టు కూడా బలంగా కనిపిస్తోంది. ఆ జట్టులో ఇబ్రహీం జద్రాన్, రహ్మనుల్లా గుర్బాజ్, మహ్మద్ నబీ, స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వంటి కీలక ఆటగాళ్లు ఉన్నారు.



తుది జట్లు:
భారత్: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ. ఆఫ్ఘనిస్థాన్: ఇబ్రహీం జద్రాన్, రహ్మనుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), సెదిఖుల్లా అటల్, రహ్మత్ షా, హష్మతుల్లా షాహిది (కెప్టెన్), అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, మహ్మద్ సలీమ్ సఫీ, ఏఎం గజన్ఫర్, జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ.

# సినిమా న్యూస్



వినోద రంగంలో నూర్ మథారు స్టైలిష్ ప్రస్థానం: భారతీయ వినోద పరిశ్రమలో నూర్ మథారు ఒక కొత్త మరియు స్టైలిష్ వ్యక్తిత్వంతో క్రమంగా గుర్తింపు పొందుతున్నారు.

## ఓటీటీలోకి 'దృశ్యం 3'.. ఎక్కడ? ఎప్పుడు?

మలయాళ స్టార్ హీరో మోహన్‌లాల్ నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. థియేటర్లలో సక్సెస్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం జూన్ 18 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ కానుంది. మే 21న విడుదలైన ఈ చిత్రం నెల రోజులు పూర్తికాకముందే డిజిటల్ ప్రేక్షకుల ముందుకు రానుంది.

'దృశ్యం 3' డిజిటల్ హక్కులను నిర్మాణ సంస్థ ఆశీర్వాద్ సినిమాస్ నుంచి ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. ఈ చిత్రం మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ అందుబాటులోకి రానుంది. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా 200కుపైగా దేశాల్లో ఒకేసారి స్ట్రీమ్ చేయనున్నారు.

దర్శకుడు జీతూ జోసెఫ్ ఈసారి కథను కొత్త కోణంలో ఆవిష్కరించారు. గత రెండు భాగాల మాదిరిగా వరుస ట్విస్టులపై కాకుండా జార్జ్‌కుట్టి పాత్ర ఎదుర్కొనే నైతిక సంఘర్షణలు, కుటుంబాన్ని కాపాడేందుకు అతడు ఎంతదూరమైనా వెళ్లే పరిస్థితులను ప్రధానంగా చూపించారు.



బాక్సాఫీస్ వద్ద కూడా 'దృశ్యం 3' భారీ విజయాన్ని నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా రూ.234.97 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రం విదేశాల్లోనే రూ.111.50 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టింది. భారత్‌లో రూ.123 కోట్లకు పైగా వసూళ్లు సాధించి అత్యధిక కలెక్షన్స్ సాధించిన మలయాళ చిత్రాల్లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. మోహన్‌లాల్‌తో పాటు మీనా, ఎస్తేర్ అనిల్, అన్సిబా హసన్, సిద్ధిఖ్, ఆశా శరత్, మురళీ గోపీ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

## బాహుబలి ఎపిక్‌కు హక్కులే విలన్ అయ్యాయా?

భారతీయ సినిమా చరిత్రలో అత్యంత ప్రభావం చూపిన సినిమాల్లో బాహుబలి సిరీస్‌కు ప్రత్యేక స్థానం ఉంది. డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: ది కన్‌క్లూజన్ సినిమాలు కలిపి గతేడాది బాహుబలి: ది ఎపిక్ పేరుతో ఒకే సినిమాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. దాదాపు 3 గంటల 44 నిమిషాల నిడివితో రూపొందించిన ఈ ప్రత్యేక వెర్షన్ థియేటర్లలో మంచి రెస్పాన్స్ ను సొంతం చేసుకుంది. రెండు భాగాల కథను ఒకే సినిమాలో చూడడం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించింది. అయితే థియేటర్లలో ప్రశంసలు అందుకున్న ఈ ఎపిక్ వెర్షన్ ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లలో మాత్రం కనిపించకపోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఇది మరింత నిరాశ కలిగించే అంశంగా మారింది. ఎందుకంటే బాహుబలి ది ఎపిక్ ప్రస్తుతం ప్రధాన ఓటీటీ వేదికల్లో తెలుగు వెర్షన్‌లో అందుబాటులో లేదు. కొంతమంది ప్రేక్షకులు ఇది త్వరలో వస్తుందని భావించినా, ఈ సినిమా రిలీజై ఎనిమిది నెలలు దాటిపోయినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదు. ఇక్కడే మరో ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. భారతదేశంలో డిజిటల్ రిలీజ్ లేకపోయినా, జపాన్ మార్కెట్‌లో మాత్రం బాహుబలి ది ఎపిక్ బ్లూరే




రూపంలో విడుదలైంది. అంతేకాదు, మెయిన్ మూవీతో పాటూ స్పెషల్ మేకింగ్ వీడియోలను కూడా అందులో చేర్చినట్లు సమాచారం. తెలుగు ఆడియో ట్రాక్‌తో కూడిన ఈ ఎడిషన్ ఇప్పటికే అక్కడి ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. దీంతో జపాన్ కు దొరికిన బాహుబలి మన తెలుగు వారికి ఎందుకు దొరకడం లేదనే ప్రశ్న సోషల్ మీడియాలో తరచూ వినిపిస్తోంది. ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా డిజిటల్, శాటిలైట్ రైట్స్ కు సంబంధించిన ఒప్పందాలే అనే చర్చ ఇండస్ట్రీ వర్గాల్లో సాగుతోంది. బాహుబలి రెండు భాగాలకు వేర్వేరు కాలాల్లో జరిగిన రైట్స్ డీల్స్, అనంతరం రూపొందిన ఎపిక్ వెర్షన్‌కు సంబంధించిన కొత్త హక్కుల వ్యవహారాలు కలిసి సాంకేతికంగా చిక్కులు సృష్టించి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకే కథను కొత్తగా ఎడిట్ చేసి రిలీజ్ చేసినప్పటికీ, దాని డిజిటల్ పంపిణీకి సంబంధించిన పర్మిషన్స్, భాగస్వామ్య సంస్థల మధ్య ఒప్పందాలు ఇంకా పూర్తిగా క్లియర్ కాలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా, బాహుబలి ది ఎపిక్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి మాత్రం ఏమాత్రం తగ్గలేదు. థియేటర్లలో చూడలేకపోయినవారు, మళ్లీ ఆస్వాదించాలని కోరుకునే అభిమానులు, ఫ్యామిలీతో కలిసి ఓటీటీలో చూడాలనుకునే ప్రేక్షకులు ఇప్పటికీ ఈ వెర్షన్ కోసం ఎదురుచూస్తున్నారు. సోషల్ మీడియాలో తరచూ దీనిపై పోస్టులు కనిపిస్తుండటం కూడా అదే విషయాన్ని సూచిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సినిమాలకు కొత్త మార్కెట్లు తెరుచుకుంటున్న సమయంలో, విదేశాల్లో బ్లూరే రూపంలో అందుబాటులో ఉన్న బాహుబలి ది ఎపిక్ స్వదేశీ ఆడియన్స్ కు అందకుండా ఉండటం నిజంగా విస్మయకరమే. ఈ గందరగోళం ఎప్పుడు ముగుస్తుందో, ఎపిక్ వెర్షన్ ఎప్పుడు ఓటీటీకి వస్తుందో చూడాలి మరి. ప్రస్తుతం అయితే బాహుబలి ఎపిక్ కోసం ప్రేక్షకుల ఎదురుచూపులే కొనసాగుతున్నాయి.

## 'దృఢమ్' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

మలయాళంలో 'షేన్ నిగమ్' కి మంచి క్రేజ్ ఉంది. ఆయన పోలీస్ ఆఫీసర్ గా నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'దృఢమ్'. జీతూ జోసెఫ్ శిష్యుడు 'మార్టిన్ జోసెఫ్' ఈ సినిమాకి దర్శకత్వం వహించాడు. జీతూ జోసెఫ్ సమర్పకుడిగా వ్యవహరించాడు. అందువలన ఈ సినిమాపై ఆయన మార్క్ కనిపిస్తుంది. మే 8వ తేదీన థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ఈ నెల 12వ తేదీ నుంచి 'జియో హాట్ స్టార్'లో స్ట్రీమింగ్ అవుతోంది. మలయాళంతో కలుపుకుని ఐదు భాషల్లో అందుబాటులో ఉంది. విజయ్ (షేన్ నిగమ్) 'పాలక్కడ్' కి చెందిన యువకుడు.తల్లిదండ్రుల కోరిక మేరకు అతను పోలీస్ ఆఫీసర్ అవుతాడు. ఫస్టు పోస్టింగ్ పై, అడవిని అనుకుని ఉన్న ఓ విలేజ్ కి వెళతాడు. అక్కడి పోలీస్ స్టేషన్ స్టాఫ్ గా, కృష్ణన్ ..బాలన్ .. సత్యన్ .. ఆనంద్ .. విద్య .. రమ్య ఉంటారు. కృష్ణన్ మాత్రం పదవీ విరమణకు దగ్గరలో ఉంటాడు. అందరూ కూడా విజయ్ ను ఎంతో ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంటారు. క్వార్టర్స్ లో సరదాగా గడుపుతూ ఉంటారు.

అలాంటి సమయంలోనే ఆ విలేజ్ కి సంబంధించిన ఆయా ప్రదేశాలలో ఒక్కొక్కటిగా శవాలు బయటపడుతూ ఉంటాయి. గుర్తుపట్టలేనంత దారుణమైన స్థితిలో ఆ శవాలు ఉంటాయి. అందరూ కూడా తల వెనుక భాగంలో బలమైన గాయం ఏర్పడిన కారణంగా చనిపోయారనే విషయం పోస్టు మార్టం నివేదికలో వెల్లడవుతుంది. అదే సమయంలో ఒక ఫైనాన్స్ కంపెనీ నుంచి 120 సవర్ల బంగారం .. 50 లక్షల నగదు మాయమవుతుంది. ఆ ఫైనాన్స్ కంపెనీని 'షాజీ' నిర్వహిస్తుంటాడు.

ఒక వైపున దొంగలను .. మరో వైపున హంతకులను పట్టుకోవడానికి విజయ్ టీమ్ రంగంలోకి దిగుతుంది. హంతకుడు ఒకరేనా? ఫైనాన్స్ కంపెనీలో జరిగిన దొంగతనానికీ .. ఈ హత్యలకు ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో విజయ్ దర్యాప్తు కొనసాగుతూ ఉంటుంది. ఈ ఇన్వెస్టిగేషన్ లో ఆయనకి ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయి? వాటిని ఆయన ఎలా ఎదుర్కొంటాడు? అనేది మిగతా కథ.

క్రైమ్ థ్రిల్లర్ .. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ సినిమాలను ఇంట్రెస్టింగ్ గా నడిపించడంలో మలయాళ దర్శకులకు మంచి నైపుణ్యం ఉంది. అందువలన ఈ జోనర్ కి సంబంధించిన సినిమాల పట్ల ఓటీటీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిని కనబరుస్తుంటారు. అదే జోనర్ లో రూపొందిన 'దృఢమ్' సినిమా కోసం కూడా అలాగే ఎదురుచూశారు. ఇది జీతూ జోసెఫ్ సమర్పించిన సినిమా కావడం, అంచనాలు పెరగడానికి మరో కారణమైంది.

ఈ కథ ఫారెస్టును అనుకుని ఉన్న ఒక విలేజ్ చుట్టూ .. ఆ విలేజ్ లోని పోలీస్ స్టేషన్ చుట్టూ .. అక్కడ కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్న పోలీసుల చుట్టూ తిరుగుతుంది. ఒక వైపున హత్యలు .. మరో వైపున ఫైనాన్స్ కంపెనీలో జరిగిన చోరీ .. ఈ రెండు సంఘటనల మధ్యలో సాగే ఒక సిన్సియర్ పోలీస్ ఆఫీసర్ కథగా మనం ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు.

మార్టిన్ చాలా వివరంగా ఈ కథను రాసుకున్నాడు. తన గురువైన జీతూ జోసెఫ్ మార్క్ కి దగ్గరగా ఈ కథను తీసుకుని వెళ్లడానికి తనవంతు ప్రయత్నం చేశాడు. పోలీసులు .. నేరస్థులు .. ఇంటరాగేషన్ .. ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలను సహజత్వానికి దగ్గరగా తీసుకుని వెళ్లడానికి గట్టిగానే ట్రై చేశాడు. అయితే ఆ ప్రయత్నంలో ఆయన కొంతవరకు మాత్రమే సక్సెస్ అయ్యాడని చెప్పుకోవలసి ఉంటుంది.


సాధారణంగా చాలా కథలు ఇంటర్వెల్ బ్యాంగ్ నుంచి కొత్త మలుపు తీసుకుంటూ ఉంటాయి. అక్కడి నుంచి కథ నెక్స్ట్ లెవెల్ కి వెళుతూ ఉంటుంది. కానీ ఈ సినిమాలో అలాంటి ఒక మలుపు ప్రీ క్లైమాక్స్ లో వస్తుంది. అప్పటి వరకూ ఇన్వెస్టిగేషన్ కి సంబంధించిన సన్నివేశాలు .. అనుమానిత పాత్రలు తెరపైకి వచ్చి వెళుతూ ఉంటాయి. అయితే ఈ తతంగం మొత్తం నడిచిన తీరు చాలా నిదానంగా అనిపిస్తుంది.

సినిమా మొత్తం కూడా చివరి 30 నిమిషాలపై ఆధారపడి నడుస్తుంది. ఈ అరగంట నిడివిలో నడిచే ఎపిసోడ్ కోసమే మిగతా గంటన్నర కథను సాగదీశారని చెప్పొచ్చు. అయితే పోలీసు పాత్రలను పోషించిన ప్రతి ఆర్టిస్ట్ ప్రదర్శించిన నటన రియలిస్టిక్ గా అనిపిస్తూ, మనలను కథ వెంట కదిలేలా చేస్తుంది. మిగతా గంటన్నర కథపై కూడా మరింత కసరత్తు చేసుంటే, ఇది జీతూ జోసెఫ్ సినిమా అంటే నమ్మేసేలా ఉండేది.

హత్యలు .. దొంగతనాలు .. అనుమానితులు .. ఇన్వెస్టిగేషన్లు అంటూ గతంలో చాలా సినిమాలు వచ్చి ఉంటాయి. అయితే ఆ సినిమాలలో ఎవరూ చూడని ఒక క్లైమాక్స్ ను .. ఎంతమాత్రం ఊహించని క్లైమాక్స్ ను ఈ సినిమాలో చూడొచ్చు. అరగంటసేపు మనలను కదలనీయకుండా చూసే ఈ క్లైమాక్స్ కోసమే ఈ సినిమాను చూడొచ్చునేమో అనిపించేలా ఉంటుంది.

కథాకథనాలు కాస్త నిదానంగానే నడుస్తాయి. అయినా ఆడియన్స్ కి బోర్ కొట్టకుండా చేసినవి ఏమైనా ఉన్నాయంటే అవి లొకేషన్స్ అనే చెప్పాలి. అద్భుతమైన లొకేషన్స్ ఆడియన్స్ ఆకలి తీరుస్తాయి. ఇక నేపథ్య సంగీతం కూడా సందర్భానికి తగినట్టుగా వెళుతుంది. ఎడిటింగ్ వర్క్ కూడా చాలా నీట్ గా అనిపిస్తుంది.

ఇంతవరకూ వచ్చిన పోలీస్ కథలకు ఈ కథ చాలా భిన్నంగా అనిపిస్తుందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. కాకపోతే చివరి అరగంట కోసం, దానికి ముందున్న కథను సాగదీయడమే కాస్త ఇబ్బందిని కలిగిస్తుంది. 'పరిస్థితులే కొంతమందిని హీరోలను చేస్తాయి .. మరికొంతమందిని విలన్స్ గా మారుస్తాయి' అనే ఒక డైలాగ్ ఈ సినిమాలో




ఉంది. ఆ పరిస్థితులు ఏమిటనేది తెలుసుకోవడానికి ఒక గంటన్నరసేపు ఓపిక పడితే, మిగతా అరగంట కథ ఆ అసంతృప్తిని దూరం చేస్తుందనే చెప్పాలి.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: దృఢం
విడుదల తేదీ: 2026-06-12
నటీనటులు: షేన్ నిగమ్, దినేష్ ప్రభాకర్, సానియా ఫాతిమా, మాథ్యూ వర్గీస్, కృష్ణ ప్రభ
దర్శకుడు: మార్టిన్ జోసెఫ్
సంగీతం: శ్రీరాగ్ సాజి
బ్యానర్: జు4 ఎక్స్‌పెరిమెంట్స్
సమీక్ష: పెద్దింటి
'దృఢం' రేటింగ్: 5కి 2.25

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662